


కలం నిఘా
WWW.KALAMNIGHA.COM
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ : సోమవారం, 27 మే 2024
సంపుటి: 14, సంచిక: 52, పేజీలు 7, వెల: 4.00
Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam





## రేవంత్ రెడ్డిని కలిసిన బాలకృష్ణ



హైదరాబాద్, మే26(నిఘా న్యూస్): సీఎం రేవంత్ ను బాలకృష్ణ కలిసిన సందర్భంగా.. ఆయనతో పాటు బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ట్రస్ట్ సభ్యులు, తదితరులు కూడా ఈ భేటీలో ఉన్నారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. టాలీవుడ్ అగ్ర హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని రేవంత్ రెడ్డి ఇంటికి వెళ్లి బాలకృష్ణ సీఎంను కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించారు. ఆ తర్వాత వివిధ రకాల అంశాలప చర్చించారు. ఇక బాలకృష్ణతో పాటు బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ట్రస్ట్ సభ్యులు, తదితరులు కూడా ఈ భేటీలో ఉన్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మర్యాదపూర్వకంగానే సీఎం రేవంత్ రెడ్డిని బాలకృష్ణ కలిశారని చెబుతున్నప్పటికీ, బసవతారకం ఆస్పత్రి విషయంలో కలిసి ఉంటారని భావిస్తున్నారు.

# తెలంగాణలో కుంభకోణాల
# కుంభమేళా

## కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ధ్వజం

**పౌర సరఫరాల శాఖలో భారీ స్కాం..**

**1100 కోట్ల అవినీతి ఎలా జరిగిందో ఆధారాలతో వివరించిన కేటీఆర్**




కాంగ్రెస్ వస్తే తెలంగాణలో కుంభకోణాల కుంభమేళా జరుగుతుందని ఎన్నికలకు ఆరు నెలల ముందు నుంచే చెబుతున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తు చేశారు. గల్లీ మే లూటో.. ఢిల్లీ మే బాంటో.. అంటే గల్లీలో దోచుకో.. ఢిల్లీలో ఉండే కాంగ్రెస్ పెద్దలకు ఇచ్చుకో అన్నట్లుగా ఉందన్నారు. ఇవాళ రైతన్నల ధాన్యం నుంచి విద్యార్థుల అన్నం వరకు అన్నింటి మీద కుంభకోణాలకు కాంగ్రెస్ పార్టీ తెరలేపిందని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

హైదరాబాద్, మే26(నిఘా న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ధాన్యం కొనుగోలులో భారీ కుంభకోణం జరిగిందని సివిల్ సప్లైస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్ సింగ్ 15 రోజుల కిందట మొట్ట మొదటిసారి నిర్దిష్ట ఆరోపణలు చేశారని కేటీఆర్ తెలిపారు. దీనిపై ప్రభుత్వం నుంచి ఏ రకమైన స్పందన కూడా రాలేదన్నారు. వారం కిందట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కూడా ఈ ఆరోపణలను ఆధారాలతో బయటపెట్టారని చెప్పారు. దీనిపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గానీ.. సీఎం రేవంత్ రెడ్డి గానీ.. ఈరోజు వరకు ఈ కుంభకోణంపై పెద్దవి విప్పడం లేదని మండిపడ్డారు. అందుకే బీఆర్ఎస్ పార్టీ తరఫున నిర్దిష్టమైన ఆధారాలతో బయటపెడుతున్నామని తెలిపారు. బీఆర్ఎస్ అంటే స్కీమ్‌లు.. కాంగ్రెస్ అంటే స్కామ్‌లు అని కేటీఆర్ పునరుద్ఘాటించారు. నిజానికి కాంగ్రెస్ అంటేనే స్కాం..గ్రెస్ అని అన్నారు. కాంగ్రెస్ వస్తే తెలంగాణలో కుంభకోణాల కుంభమేళా జరుగుతుందని ఎన్నికలకు ఆరు నెలల ముందు నుంచే చెబుతున్నామని గుర్తు చేశారు. గల్లీ మే లూటో.. ఢిల్లీ మే బాంటో.. అంటే గల్లీలో దోచుకో.. ఢిల్లీలో ఉండే కాంగ్రెస్ పెద్దలకు ఇచ్చుకో అన్నట్లుగా ఉందన్నారు. ఇవాళ రైతన్నల ధాన్యం నుంచి విద్యార్థుల అన్నం వరకు అన్నింటి మీద కుంభకోణాలకు కాంగ్రెస్ పార్టీ తెరలేపిందని అన్నారు. ధాన్యం కొనుగోలు పూర్తికాక.. కొనుగోళ్ల కేంద్రాల వద్ద రైతులు కన్నీళ్లు పెట్టుకుంటే.. ప్రభుత్వం మాత్రం ధాన్యం కొనుగోళ్లపై దృష్టి పెట్టకుండా.. ధాన్యం కుంభకోణంపై దృష్టిపెట్టారని అన్నారు. ముఖ్యమంత్రి పేషీ నుంచి పౌరసరఫరాల డిపార్ట్‌మెంట్ నుంచే ఈ కుంభకోణం మిగతా2లో..

## కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలది
# తప్పుడు ప్రచారం

**ధాన్యం కొనుగోలు విషయంలో**

**రైతులకు మేలు జరిగేలా చూస్తున్నాం: మంత్రి ఉత్తమ్**



హైదరాబాద్, మే26(నిఘా న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలది తప్పుడు ప్రచారమని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మండిపడ్డారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు మేలు జరిగేలా చూస్తున్నామన్నారు. తాలు, తరుగు విషయంలో అవకతవకలకు పాల్పడితే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మిగతా2లో..

## కార్పొరేట్ బ్యాంకులకు... ఆర్‌బిఐ ఊడిగం

**కార్పొరేట్ కంపెనీలకు ఉపయోగపడే నిర్ణయాలు చేస్తోంది**

**సహకార రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ఆర్బిఐ**

**సహకార రంగంతోనే సామాన్యుల జీవన ప్రమాణాల మెరుగు**

**సహకార బ్యాంకుల వ్యవస్థపై ఆర్‌బిఐ నియంత్రణ ఎక్కువైంది**

**వైజాగ్ కో ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ సత్య నారాయణమూర్తి**




తిరుపతి మే 26 (నిఘా న్యూస్): సహకార బ్యాంకింగ్ వ్యవస్థను ఆర్.బి.ఐ నిర్వీర్యం చేస్తుందని వైజాగ్ కో ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ జెవి మిగతా2లో..


## ఇండియా కూటమికి ఓటేస్తే వృధా

**ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ**



మీర్జాపూర్, మే26(నిఘా న్యూస్): లోక్ సభ తుదిదశ ఎన్నికల ప్రచారం మరింత వేడెక్కింది. కీలకమైన యూపీలో జోరుగా ప్రచారం చేశారు ప్రధాని మోదీ. రాజ్యాంగాన్ని మార్చి మతప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేసేందుకు ఇండియా కూటమి కుట్ర చేసిందన్నారు. అయితే మూడోసారి కూడా మతరాజకీయాలు చేసి అధికారం లోకి వచ్చేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని ప్రియాంక కౌంటరిచ్చారు. లోక్ సభ ఎన్నికల తుదిదశ ప్రచారాన్ని మరింత వేగవంతం చేశారు ప్రధాని మోదీ. ఉత్తరప్రదేశ్‌లో ఆయన సుడిగాలి ప్రచారం చేశారు. జూన్ 1వ తేదీన తుదిదశ పోలింగ్ జరుగుతుంది. అధికారంలోకి వస్తామని ఇండియా కూటమి నేతలు పగటికలలు కంటున్నారని విమర్శించారు. నష్టాల్లో ఉన్న షేర్లతో ఇండియా కూటమిని పోల్చారు మోదీ. నష్టాల్లో ఉన్న కంపెనీ షేర్లను ఎవరు కొనరని , ఇండియా కూటమికి ఓటేసిన వృధా అవుతుందని విమర్శించారు. చాయ్‌తో తనకు ఉన్న మిగతా2లో..

## కొండచరియల బీభత్సం..
# 670 మంది సమాధి!



పపువా న్యూ గినియా, మే26(నిఘా న్యూస్): పసిఫిక్ దేశమైన పపువా న్యూ గినియాలోని ఎన్గా ప్రావిన్స్‌లో పెద్దఎత్తున కొండచరియలు విరిగిపడి బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. శుక్రవారం నాటి ఈ ప్రకృతి విపత్తు కారణంగా తొలుత 100 మందికిపైగా మృతి చెందినట్లు వార్తలు వచ్చాయి. ఈ సంఖ్య భారీగానే ఉన్నట్లు ఐరాస తాజాగా అంచనా వేసింది. దాదాపు 670 మందికిపైగా ప్రాణాలు కోల్పోయి మిగతా2లో..

## దేశ స్వాతంత్ర్య పోరాటంలో
# పంజాబ్ పాత్ర కీలకం

**ఎంతో మంది ప్రాణ త్యాగం చేశారు**

**ముందు అరెస్టు.. తర్వాత ఎన్నికల్లోకి.. మోదీ సర్కార్‌పై కేజ్రీవాల్ ఆరోపణలు**



ఛండీగఢ్, మే26(నిఘా న్యూస్): దేశ స్వాతంత్ర్యం, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నాయని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. కేంద్రంలోని మోదీ సర్కార్‌ను ఉద్దేశిస్తూ తీవ్ర విమర్శలు చేశారు. పంజాబ్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన మిగతా2లో..

## పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుపై
# ఈసీ స్పష్టమైన ఆదేశాలు జారీ

అమరావతి, మే26(నిఘా న్యూస్): కేంద్ర ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు పలు మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మేరకు ఏపీ సీఈవోకు అందిన ఉత్తర్వులు జిల్లా అధికారులకు చేరవేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా పోస్టల్ బ్యాలెట్ నమోదై రికార్డు సృష్టించింది. ఏపీలో 5 లక్షల 40 వేల మంది పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల్లో పాల్గొన్న సిబ్బంది, హోం ఓటింగ్, డ్రైవర్లు, మెడికల్ అండ్ హెల్త్ సిబ్బంది, జర్నలిస్టులు వంటి అత్యవసర సర్వీసుల కింద కూడా ఉన్నవారు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ వేసే మిగతా2లో..




## తిరుమలలో హనుమాన్ జయంతి
# ఉత్సవాలు

**జూన్ 1 నుంచి 5వరకు**



తిరుమల, మే26(నిఘా న్యూస్): జూన్ 1 నుంచి 5వ తేదీ వరకు అంజనాద్రి ఆకాశ గంగ ఆలయం, జపాలి తీర్థంలో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు టీటీడీ సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా ఐదు రోజులు ఆకాశ గంగలో బాలాంజనేయ స్వామి అంజనాదేవికి ప్రత్యేక అభిషేకం నిర్వహించడంతో పాటు జపాలి తీర్థంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఆకాశ గంగలోని అంజనాద్రి ఆలయంలో ఐదురోజుల పాటు ఉదయం 8.30 నుంచి మిగతా2లో..

## జ్యువెలర్స్‌పై ఐటీ దాడులు..

**భారీగా లెక్కల్లో చూపని సొత్తు..**

న్యూఢిల్లీ, మే26(నిఘా న్యూస్): నాసిక్ నగరంలోని సురానా జ్యువెలర్స్‌పై ఐటీ సోదాలు జరిగాయి. కాగా., సురానా జ్యువెలర్స్‌పై యాజమాన్యం వెల్లడించని అనేక లావాదేవీల పై ఆదాయపు పన్ను శాఖ దాడులు మొదలు పెట్టింది. ఆదాయపన్ను శాఖ చేసిన దాడుల్లో దాదాపు రూ. 26 కోట్ల నగదు, రూ. 90 కోట్ల విలువైన లెక్కల్లో చూపని ఆస్తుల పత్రాలు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గత కొన్ని రోజులుగా ఆదాయపు పన్ను శాఖ మహారాష్ట్రలో చాలా యాక్టివ్ గా పని చేస్తోంది. తాజాగా నాందేడ్ లో దాడులు నిర్వహించి ఏకంగా రూ. 170 కోట్ల విలువైన లెక్కల్లో చూపని సొత్తును స్వాధీనం చేఉకున్న సంగతి తెలిసిందే. దీని మిగతా2లో..





## కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలది తప్పుడు ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

హెచ్చరించారు. సన్నబియ్యం కొనలేదని ప్రతిపక్షాలు అంటున్నాయని, రూ.42కు సన్నబియ్యం ఇస్తే ప్రభుత్వం ఎంతైనా కొనుగోలు చేస్తుందని చెప్పారు. సన్నబియ్యంపై ఒక్క రూపాయి కూడా ఖర్చుపెట్టలేదని, దీనిపై టెండర్ పెట్టి రద్దు చేశామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్ష నేతలు పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, 1.30 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెబుతున్నారని ఉత్తమ్ మండిపడ్డారు. " నాపై బాధ్యతారహితమైన ఆరోపణలు చేస్తున్నారు. గతప్రభుత్వంలో క్వింటా ధాన్యం ధర రూ.1700గా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక క్వింటా ధాన్యం రూ. 2007 పలికింది. మా ప్రభుత్వంలో రైతులకు రూ.1,100 కోట్ల అదనపు ఆదాయం వచ్చింది" అని ఉత్తమ్ తెలిపారు.

## ఇండియా కూటమి అధికారంలోకి వస్తేనే దేశానికి మేలు

**ఫరీద్‌కోట్ ఎన్నికల ప్రచారంలో భట్టి విక్రమార్క**



**ఫరీద్‌కోట్, మే26(నిఘా న్యూస్):** ఇండియా కూటమి అధికారంలోకి రాగానే చట్టబద్ధంగా రైతులకు కనీస మద్దతు ధర అందిస్తామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన పంజాబ్ రాష్ట్రంలోని ఫరీద్‌కోట్ లోక్‌సభ పరిధిలో ఏర్పాటు చేసిన పలు సమావేశాల్లో ప్రసంగించారు. దేశంలో వరి, పత్తి, చెరకు రైతులకు మద్దతు ధర లభించడం లేదని, ప్రధాని మోదీ నల్ల చట్టాలు తీసుకొచ్చి రైతుల ధనాన్ని లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దేశంలోని నిరుద్యోగులకు అప్రెంటిషిప్ హక్కు కల్పిస్తూ కొత్త చట్టాన్ని తీసుకొస్తా మన్నారు. దేశంలోని పట్టభద్రులు, డిప్లొమా చేసిన వారందర్నీ ఈ పరిధిలోకి తీసుకొస్తామన్నారు. దేశంలోని పబ్లిక్, ప్రైవేటు సెక్టార్లలో సుమారు 30 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, ఆగస్టు 15 లోపు ఇండియా కూటమి ఈ ఉద్యోగాలను భర్తీ చేస్తుందని భట్టివిక్రమార్క హామీ ఇచ్చారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ వర్సిటీలు, కళాశాలలు, పాఠశాలలు, ఆస్పత్రుల్లో నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామన్నారు. కోట్లాది మంది నిరుద్యోగుల ఖాతాల్లో ఏడాదికి రూ.లక్ష నగదును జమచేస్తామన్నారు. ప్రస్తుతం ఉపాధి హామీ కూలీలకు ఇస్తున్న రోజువారి కూలీ.. రూ.250ని రూ.400కి పెంచడంతోపాటు ఆశావర్కర్ల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పారు.

గత పదేళ్ల వ్యవధిలో ప్రధాని మోదీ 25 మందికి సంబంధించిన రూ. 16 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేశారని, ఆ డబ్బుతో 24 ఏళ్ల పాటు ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయొచ్చని చెప్పారు. భాజపా ప్రభుత్వం 25 మందిని కుబేరులని చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం కోట్లాది మంది దేశ ప్రజల్ని లక్షాధికారులని చేస్తుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్‌ను చూసి భాజపా భయపడుతోందని, అందుకే కాంగ్రెస్ నేతల్ని టార్గెట్ చేస్తూ మోదీ విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఆల్ ఇండియా సర్వీసు అధికారుల్లో ఎస్సీ, ఎస్టీలు ఎంతమందో చెప్పడం లేదని, ఇండియా కూటమి అధికారంలోకి రాగానే రిజర్వేషన్ ప్రకారం పోస్టులు కేటాయిస్తామని చెప్పారు. మహిళలకు జనాభా దామాషా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు.

## దేశ స్వాతంత్ర్య పోరాటంలో పంజాబ్ పాత్ర కీలకం..

(మొదటిపేజీ తరువాయి)

భాజపాపై విరుచుకుపడ్డారు. 'దేశ స్వాతంత్ర్య పోరాటంలో పంజాబ్ పాత్ర కీలకం. ఎంతో మంది ప్రాణ త్యాగం చేశారు. ప్రస్తుతం భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ ప్రమాదంలో ఉన్నాయి. వాటిని కాపాడేందుకు పంజాబ్ మరోసారి ముందుకు రావాల్సిన సమయం ఆసన్నమైంది. మన రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి" అని కేజ్రీవాల్ పిలుపునిచ్చారు.

**పథకం ప్రకారమే నన్నూ అరెస్టు చేశారు..**

ఆప్ కీలక నేతల అరెస్టులను ప్రస్తావిస్తూ.. మోదీ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. "ఆప్ నేతలైన మనీశ్ సిసోదియా, సంజయ్ సింగ్ మరికొందరిని భాజపా అరెస్టు చేయించింది. నన్నూ పథకం ప్రకారమే అరెస్టు చేశారు. సార్వత్రిక ఎన్నికలు ప్రకటించిన రోజుల వ్యవధిలోనే ఇది జరిగింది. కేంద్రంలోని భాజపా.. ప్రతిపక్షాలు పాలిస్తున్న రాష్ట్రాల్లో కీలక నేతలను కారాగారంలోకి నెట్టి ఎన్నికల బరిలోకి దిగుతోంది. వారికి ఎలాంటి పోటీ లేకుండా చేసేందుకు ప్రయత్నిస్తోంది. ప్రధాని మోదీ.. మహారాష్ట్రలోని ఎన్సీపీని రెండుగా చీల్చారు. శివసేనను ముక్కలు చేసి.. పార్టీ గుర్తును లాక్కున్నారు. ఆ తర్వాత ఝార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్‌ను కటకటాల పాలు చేశారు" అని కేజ్రీవాల్ ఆరోపించారు.

## కొండచరియల బీభత్సం.. 670 మంది సమాధి!

(మొదటిపేజీ తరువాయి)


ఉండొచ్చని 'అంతర్జాతీయ వలసల సంస్థ తెలిపింది. దాదాపు నాలుగు ఫుట్‌బాల్ మైదానాల మేర విస్తీర్ణంలో శిథిలాలు పరచుకున్నట్లు సమాచారం.

"ప్రమాద సమయంలో తొలుత 60 ఇళ్లు కొండచరియల కింద నేలమట్టమైనట్లు భావించాం. అయితే, స్థానిక అధికారుల లెక్కల్లో మొత్తం 150 ఇళ్లు శిథిలాల కింద కూరుకుపోయినట్లు తేలింది. దాదాపు 670 మంది సమాధి అయినట్లు వారు భావిస్తున్నారు. ఆరు నుంచి ఎనిమిది మీటర్ల లోతులో చిక్కుకుపోయిన వారు ప్రాణాలతో బయటపడే అవకాశం దాదాపు లేనట్లే" అని వలసల సంస్థ అధికారులు వెల్లడించారు. ఆదివారం నాటికి కేవలం అయిదు మృతదేహాలు మాత్రమే వెలికితీసినట్లు సమాచారం. మరోవైపు.. ప్రాణాలతో బయటపడిన వారిని అధికారులు సురక్షితమైన ప్రదేశాలకు తరలిస్తున్నారు.

పపువా న్యూ గినియా రాజధాని పోర్ట్ మోర్స్బీకి 600 కిలోమీటర్ల దూరంలోని ఎన్గా ప్రావిన్స్‌లో ఈ విపత్తు సంభవించింది. స్థానిక కాలమానం ప్రకారం తెల్లవారుజామున 3 గంటలకు ప్రజలు నిద్రలో ఉన్న సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకోవడంతో ప్రాణనష్టం భారీగా వాటిల్లింది. ఒకవైపు మరిన్ని కొండచరియలు విరిగిపడే ముప్పు పొంచివుండటం.. మరోవైపు ప్రావిన్స్ రాజధాని వాబాగ్ నుంచి ఘటనాస్థలానికి చేరుకునే మార్గంలో తెగల ఘర్షణల కారణంగా బాధితులకు సహాయక సామగ్రి చేరవేయడంలో ఆటంకాలు ఎదురవుతున్నాయని అధికారులు తెలిపారు. సహాయక కాన్వాయ్‌లకు సైనికులు భద్రత కల్పిస్తున్నారు.

## జ్యువెలర్స్‌పై ఐటీ దాడులు..

(మొదటిపేజీ తరువాయి)



తర్వాత, ఇప్పుడు నాసిక్ లో చర్యలు తీసుకుంటుండగా మరికొన్ని కోట్ల విలువైన నగదు పట్టుబడింది. ఈ దాడి నేపథ్యంలో ఆదాయపు పన్ను శాఖ అధికారులు బంగ్లాలోని ఫర్నిచర్ ను మొదలగు వాటిని కూడా పగులగొట్టి నగదును స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం అందింది. అధికారులు చేసిన ఈ చర్య వల్ల నగరంలో ఈ కేసు సంచలనం సృష్టించింది. ఈ ఆపరేషన్ మొత్తం 30 గంటల పాటు సాగిందని., అందుగాను 50 - 60 మంది అధికారులు సురానా జ్యువెలర్స్ షాపుతో పాటు అతని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే కార్యాలయలపై దాడులు చేశారు.

# తెలంగాణలో కుంభకోణాల కుంభమేళా

(మొదటిపేజీ తరువాయి)

జరిగిందని తమకు సమాచారం ఉందన్నారు. ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టడం.. కొంతమంది కాంట్రాక్టర్లకు దోచిపెట్టడం.. వాళ్లు వీళ్లు కలిసి సీక్రెట్‌గా దందా చేసి వెయ్యి కోట్లు కుంభకోణం చేశారని ఆరోపిపంచారు.

రాష్ట్రంలో బీ ట్యాక్స్ అని.. ఆర్ ట్యాక్స్ అని.. ఆర్ఆర్ ట్యాక్స్ అని.. యూ ట్యాక్స్ అని ట్యాక్స్‌ల గురించి వింటున్నామని అన్నారు. ఈ స్కాంలో మాత్రం కేవలం తెలంగాణలోని కాంగ్రెస్ పెద్దలకే కాకుండా ఢిల్లీ పెద్దల దాకా కూడా హస్తం ఉందని తమకు సమాచారం ఉందన్నారు. 1.67 కోట్ల మంది మహిళలకు వంద రోజుల్లో నెలకు రూ.2500 ఇస్తామన్నారు.. రాష్ట్రంలో 46 లక్షల మంది వృద్ధులకు 4వేలు పింఛన్లు ఇస్తామన్నారు.. ఆ ఫైలు కదలడం లేదు.. రైతులకు రైతు భరోసా కింద రూ.15వేలు అన్నారు.. ఆ ఫైలు కదలడం లేదు. సంక్షేమ పథకాలపై మాట ఇచ్చిందో.. ప్రజల జేబులు నింపే పని చేతనైతలేదు గానీ.. కాంగ్రెస్ పెద్దలు మాత్రం తమ జేబులు నింపుకోవడంలో బిజీ బిజీగా ఉన్నారని విమర్శించారు.




**పౌర సరఫరాల శాఖలో భారీ స్కాం..**

పౌర సరఫరాల శాఖలో భారీ స్కాం జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పేరుతో 700 నుంచి 750 కోట్లు, మధ్యాహ్న భోజన పథకం కింద 2.20 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం కొనుగోలు పేరిట మరో 300 కోట్లు.. మొత్తంగా వెయ్యి కోట్ల కుంభకోణం చేశారని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. స్కాం వివరాలను వెల్లడించారు. ఈ కుంభకోణం రెండు భాగాలుగా జరిగిందని వివరించారు.

ముందుగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సేకరించి మిల్లర్ల దగ్గర ఉంచిన 35 లక్షల మెట్రిక్ ధాన్యాన్ని విక్రయించేందుకు మూడు నెలల కింద రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో పౌరసరఫరాల శాఖ గ్లోబల్ టెండర్ల కహానీకి తెరలేపింది. అధికారంలోకి వచ్చి 50 రోజులు కాకముందే ఈ దోపిడీకి తెరలేపి.. జనవరి 25న కమిటీ వేసింది. అదే రోజు మార్గదర్శకాలు జారీ చేసి.. టెండర్లను పిలిచింది. ఇంకా విచిత్రమేంటంటే.. క్వింటాలుకు రూ.2100 కు కొనుగోలు చేయానికి రైస్ మిల్లర్లు సుముఖత వ్యక్తం చేసినప్పటికీ దాన్ని రిజెక్ట్ చేసి.. గ్లోబల్ టెండర్లు పిలిచారు. ప్రత్యేక నిబంధలు పెట్టి కేవలం నాలుగు కంపెనీలకే టెండర్లు వచ్చేటట్టు చేశారు. కేంద్రీయ బండార్, ఎల్జీ ఇండస్ట్రీస్, హిందూస్తాన్ కంపెనీ, నాక్‌హాఫ్ అనే నాలుగు సంస్థలు ఈ టెండర్లను దక్కించుకున్నాయి. గురుకులాల్లో కాంట్రాక్ట్ దక్కించుకున్న తర్వాత సరిగ్గా పనిచేయలేదని కేంద్రీయ బండార్ అనే సంస్థను 2023లో బీఆర్ఎస్ ప్రభుత్వం బ్లాక్ లిస్ట్ చేసింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కేంద్రీయ బండార్ సంస్థ కోసం రూల్స్‌ను రిలాక్స్ చేశారు.

మిల్లర్లు క్వింటాలుకు 210 చెల్లించి కొనుగోలు చేస్తామని సుముఖత వ్యక్తం చేసినప్పటికీ.. ఆ నాలుగు కంపెనీలకే టెండర్లు కట్టబెట్టారు. క్వింటాలుకు దాదాపు 200 తగ్గించి.. 1885-2007 రూపాయలకు కొనుగోలు చేసేలా ఒప్పందం చేశారు. ఈ టెండర్ మార్గదర్శకాల ప్రకారం 90 రోజుల్లో 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని లిఫ్ట్ చేసి.. ప్రభుత్వానికి రూ.7500 కోట్లు చెల్లించాలని నిబంధన పెట్టింది. టెండర్ గైడ్‌లైన్స్ ప్రకారం.. ఈ నాలుగు కంపెనీలు ధాన్యాన్ని లిఫ్ట్ చేయాలి.. తప్ప ఏ లావాదేవీల్లో పాల్గొనవద్దు. కానీ వీళ్లు మిల్లర్లతో నేరుగా ఆర్థికపరమైన లావాదేవీలు చేస్తూ మనీలాండరింగ్‌కు పాల్పడ్డారు. గోదాముల్లోని ధాన్యాన్ని తీసుకుపోకుండా రైస్ మిల్లర్లపై బెదిరింపులకు పాల్పడ్డారు. టెండర్లు వేసింది 1885-2007 రూపాయలకు గానీ.. క్వింటాలుకు 2230 రూపాయలు చెల్లించాల్సిందే అని రాష్ట్రంలో ఉన్న నాలుగు వేల మంది రైస్ మిల్లర్లను కాంట్రాక్ట్ సంస్థలు బ్లాక్‌మెయిల్ చేస్తున్నాయి.

క్వింటాలుకు రూ. 2007 కొనుగోలు చేయాలని కోట్ చేసినప్పటికీ మిల్లర్లు ఇంకో రూ.236 అదనంగా ఇవ్వాల్సిందేనని జలసౌధలో అనధికారికంగా ఒక ఒప్పందం కుదర్చుకున్నారు. సీఎం పేషీకి ఖర్చయ్యింది.. ఢిల్లీకి పోవాలి.. ఎలక్షన్స్ ఉన్నాయి కాబట్టి క్వింటాలుకు 150 నుంచి 236 రూపాయలు అదనంగా చెల్లించి తీరాలని రైస్ మిల్లర్లను ఒత్తిడి చేశాయి. దీనికి సహకరించకపోతే విజిలెన్స్, జీఎస్టీ దాడులు జరుగుతాయని బెదిరిస్తున్నాయి. క్వింటాలుకు రూ.236 ఎక్కువగా ఇస్తే.. ధాన్యం లిఫ్ట్ చేయకపోయినా చేసినట్టు క్లియరెన్స్ ఇస్తామని బంపరాఫర్ కూడా ఇచ్చారు. అలా రైస్ మిల్లర్లపై పెద్ద ఎత్తున ఒత్తిడి తీసుకొచ్చి భారీ స్థాయిలో నగదు బదిలీ జరిగిందని సమాచారం అందింది. దాదాపు 35లక్షల మెట్రిక్ టన్నులకు 200 చొప్పున చూసుకున్నా 700 కోట్ల అదనపు డబ్బు మనీలాండరింగ్ ద్వారా మిల్లర్ల దగ్గర వసూలు చేస్తున్నారు. కాంట్రాక్ట్ పొందిన సంస్థలు కేవలం 90 రోజుల్లో ధాన్యం లిఫ్ట్ చేయాలి.. చేయకపోతే ఏకారణంతో చేయలేదో చెప్పాలి.. 7,500 కోట్లు కట్టాలి. కానీ టెండర్ దక్కించుకున్న నాలుగు కంపెనీలు మాత్రం రైస్ మిల్లర్ల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాయి. అసలు సంబంధంలేని ప్రైవేటు సంస్థలు.. ప్రభుత్వం తరఫున డబ్బులు ఎలా వసూలు చేస్తాయి? 2100కు కొంటామని మిల్లర్లు కొంటామని సుముఖత వ్యక్తం చేసినా 1800-2007 కింద బ్యాండ్ ఫిక్స్ చేసి.. ఎలిజిబిలిటీ క్రిటిరియా కింద ఎందుకు చిన్న చిన్న సంస్థలను ఎందుకు ఎగరగొట్టారో సమాధానం చెప్పాలి. మిల్లర్లకు ఇచ్చిన 90 రోజుల గడువు అయిపోయింది.. ఇప్పటికీ 20 శాతం కూడా లిఫ్ట్ చేయలేదు.. దీని వెనుక ఏం జరుగుతుంది.

డెడ్‌లైన్ అయిపోయిన తర్వాత నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి.. బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలి. కానీ తమకు రావాల్సిన 700 కోట్లు మొత్తం వాళ్ల చేతికి రాలేదు కాబట్టి ఈ డెడ్‌లైన్‌ను పెంచే ప్రయత్నం చేస్తున్నారు. మిల్లర్లను బెదిరించి ఇవాళ అదనంగా డబ్బులు వసూలు చేయాలని చూస్తున్నారు. మిల్లుల్లోని ధాన్యాన్ని లిఫ్ట్ చేస్తేనే.. స్థలం ఖాళీ అవుతుంది.. అప్పుడు ప్రభుత్వానికి డబ్బులు వస్తాయి.. ఒకవేళ జరగకపోతే 150 కోట్ల వడ్డీని అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి పౌరసరఫరాల శాఖకు వస్తుంది.' అని కేటీఆర్ తెలిపారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారు.. ఎంత లిఫ్ట్ చేశారో శ్వేతపత్రం ప్రచురించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ బ్లాక్ లిస్ట్‌లో పెట్టిన కేంద్రీయ బండార్‌పై వెంటనే బ్లాక్‌లిస్ట్ నుంచి తీసేసి టెండర్‌లో పాల్గొనేందుకు అనుమతించారో ప్రజలకు వివరంగా చెప్పాలన్నారు. ఇందులో వందల కోట్లు ముట్టిన మాట వాస్తవమో కాదో ఎంక్వైరీ ద్వారా తేల్చాలన్నారు.

కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలనే ఉద్దేశంతో సన్న బియ్యం అందించే స్కీమ్ తీసుకొచ్చామని కేటీఆర్ తెలిపారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అందులో కూడా స్కామ్ చేశారని చెప్పారు. ' మధ్యాహ్న భోజన పథకానికి 2.20 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం కావాలి. దీనికోసం పౌరసరఫరాల శాఖ గ్లోబల్ టెండర్ పిలిచింది. ఇందులో కూడా అవే నాలుగు కంపెనీలు పాల్గొన్నాయి. బహిరంగ మార్కెట్‌లో సన్న బియ్యం ధర 42-45 రూపాయలు ఉంది. కానీ బహిరంగ మార్కెట్, మిల్లర్లను పక్కనబెట్టి టెండర్ల పిలిచారు. కిలోకు 15 రూపాయలు అదనంగా అంటే 57 రూపాయలతో టెండర్ ఖరారు చేశారు. 2.20 లక్షల మెట్రిక్ టన్నులకు 15 రూపాయలు అదనంగా అంటే 300 కోట్ల స్కామ్ జరిగింది. మొత్తంగా వెయ్యి, 1100 కోట్ల స్కామ్ జరిగింది. ' అని కేటీఆర్ వివరించారు.

' ప్రతి సంవత్సరం రాష్ట్రంలోని రైతుల నుంచి పౌరసరఫరాల శాఖ కొని.. ఎఫ్‌సీఐకి అమ్ముతుంది. రైతుల నుంచి దొడ్డు, సన్న రకాల వడ్లు కొంటాం. మా ప్రభుత్వం హయాంలో కొనుగోలు చేసిన దాంట్లో 1.6 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం ఉంది. దాన్ని మిల్లింగ్ చేసి స్కూల్ డిపార్ట్‌మెంట్‌కు ఇస్తే.. కేవలం 60 వేల టన్నులు కొనాల్సి వచ్చేది. కానీ 1.6 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం ఉన్నప్పటికీ దాన్ని రూ.22.59 పైసలకు అమ్మేశారు. అలా కాకుండా ఈ ధాన్యాన్ని మిల్లర్లకు ఇచ్చి సన్న బియ్యం తీసుకోవచ్చు. తద్వారా లక్ష టన్నుల సన్న బియ్యం కేవలం రూ.35కే వచ్చేది. ఈ లక్ష టన్నులు పోనూ మిగిలిన దానికి టెండర్లు పిలుచుకోవాల్సింది. కానీ ఆ ధాన్యాన్ని అమ్మి.. సన్న బియ్యాన్ని ఎక్కువ ధరకు కొనుగోలు చేశారు' అని తెలిపారు.

# తెలంగాణలో భారీ వర్షాలు

**వేర్వేరు ఘటనల్లో పది మంది మృత్యువాత..**

**హైదరాబాద్, మే26(నిఘా న్యూస్):** తెలంగాణలోని పలు జిల్లాల్లో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దాంతో పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొన్నది. వర్షాలకు వేర్వేరు ఘటనల్లో పది మంది మృతి చెందారు. దీంతో మృతుల కుటుంబాల్లో విషాదం అలుముకున్నది. నాగర్ కర్నూలు జిల్లాలో ఆదివారం వర్షం కురిసింది. తాడూరు మండలం ఇంద్రకల్ గ్రామ శివారులో షెడ్ నిర్మాణంలో ఉండగా.. సాయంత్రం వర్షానికి గోడ కూలిపోయింది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.

మృతుల్లో కోళ్ల ఫామ్ యజమానితో పాటు అతని కుమార్తె, ఇద్దరు కూలిలో చనిపోయారు. మృతులను కోళ్లఫామ్ యజమాని మల్లేశ్ (40), అతని కూతురు అనూష (10), కూలీలు చెన్నమ్మ, రాము మృతి చెందారు. కూలీలు చెన్నమ్మ, రాము స్వస్థలం పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లి. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు చోటు చేసుకున్నాయి. మృతదేహాలను జిల్లా ఆసుపత్రికి తరలించారు. అలాగే, తెలకపల్లిలో పిడుగుపాటుకు ఓ బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. నందివడ్డెమాన్ గ్రామంలోనూ ఓ వ్యక్తి మృతి చెందాడు. మరో వైపు నాగర్‌కర్నూల్, పాలెం, బిజినేపల్లి, తిమ్మాజిపేట, చెన్నపురావుపల్లి, కల్వకుర్తి, పదర, పెద్దూరు, తూడుకుర్తిలాంటి పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి.

ఇదిలా ఉండగా.. కీసరలో ఈదురుగాలులకు చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందారు. తిమ్మాయిపల్లి నుంచి షామీర్‌పేట వెళ్లేదారిలో చెట్టు విరిగిపడింది. దాంతో రాంరెడ్డి, ధనుంజయరెడ్డి అనే ఇద్దరు మృతి చెందారు. రాంరెడ్డి సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడువగా.. చికిత్స పొందుతూ ధనుంజయరెడ్డి కన్నుమూశాడు. మృతుల స్వస్థలం యాదాద్రి జిల్లా బొమ్మల రామారంగా గుర్తించారు. సిద్దిపేట జిల్లాల్లోనూ వర్షాలకు గోడకూలి మరో ఇద్దరు ప్రాణాలు వదిలారు. ములుగు మండలం క్షీరసాగర్‌లో కోళ్లఫారం కోడకూలింది. ఇదే ఘటనలో మరో ముగ్గురికి గాయాలయ్యాయి.

# కార్పొరేట్ బ్యాంకులకు... ఆర్‌బిఐ ఊడిగం

(మొదటిపేజీ తరువాయి)

సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. కేవలం కార్పొరేట్ బ్యాంకింగ్ వ్యవస్థకు, కార్పొరేట్ కంపెనీలకు ఉపయోగపడే నిర్ణయాలు చేస్తోందని విమర్శించారు. ఆదివారం సాయంత్రం తిరుపతి బైరాగి పట్టెడ లోని గంధమనేని శివయ్య కృష్ణారెడ్డి భవన్ లో ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ తిరుపతి బ్రాంచ్ సభ్యుల మహాసభ జరిగింది. ఈ సభలో బ్యాంక్ ఇన్చార్జి డైరెక్టర్లు నారాయణస్వామి, జే వి సత్యనారాయణమూర్తి ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. సహకార రంగంతోనే సామాన్యుల జీవన ప్రమాణం మెరుగ పడుతుందని, అలాంటి వ్యవస్థను ప్రోత్సహించకుండా నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా ఆర్బిఐ నిర్ణయాలు చేస్తోందని జెవి సత్యనారాయణమూర్తి చెప్పారు. ఆర్బిఐ పుట్టకముందే సహకార వ్యవస్థ ఏర్పడింది అన్నారు. ప్రజల డిపాజిట్ లతో సహకార బ్యాంకులు అభివృద్ధి చెందిన పరిస్థితి వుందన్నారు. దేశంలో ఉపాది అవకాశాలు తగ్గిపోయింది అన్నారు. అర్హతకు తగ్గ ఉపాధి అవకాశాలు లేవు అన్నారు. సహకార బ్యాంకుల వ్యవస్థపై ఆర్ బిఐ నియంత్రణ ఎక్కువ అయిందని మండి పడ్డారు. బ్యాంకింగ్ రంగంలో కార్పొరేట్ బ్యాంకులకు ఆర్బిఐ ఊడిగం చేస్తుందన్నారు. జాతీయ బ్యాంకులు బడా కార్పొరేట్ వ్యవస్థలకు రుణాలు ఇస్తున్నాయని అయితే సహకార బ్యాంకులో సామాన్యుడికి రుణాలు ఇచ్చి సహకరిస్తున్నాయని చెప్పారు. బంగారంపై లోన్లు ఇవ్వడంలో సహకార బ్యాంకులు ముందు వరుసలో ఉన్నాయని అన్నారు. వైజాగ్ కో ఆపరేటివ్ బ్యాంక్ ఆధ్వర్యంలో 40 శాతం రుణాలు బంగారంపై ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. రెండు లక్షల వరకు బంగారు రుణాలు ఇవ్వాలని సహకార బ్యాంకులకు ఆంక్షలు విధించారని, అదే జాతీయ బ్యాంకుల విషయంలో నియంత్రణ లేకుండా ఆర్బిఐ వ్యవహరిస్తోంది అన్నారు. 10 లక్షల రూపాయల వరకు బంగారం రుణాలపై పరిమితి ఉంచాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. కేవలం నాలుగు లక్షల వరకు మాత్రమే ఇవ్వాలని అనుమతులు ఇచ్చారని పేర్కొన్నారు. సామాన్య ప్రజలు సొంత ఇంటి కోసం స్థలం కొనుగోలు చేస్తే దాని కోసం ఇచ్చే రుణాలపై నియంత్రణ పెట్టడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. వ్యవసాయ పంటలకు రుణాలు ఇవ్వడానికి వీలు లేకుండా చేశారన్నారు. సహకార లేకుంటే మానవ మనుగడ లేదు అన్నారు. సహకార వ్యవస్థ తోనే సామాన్య ప్రజల స్థితి గతులు మెరుగు అవుతుంది అన్నారు. సహకార బ్యాంకుల లో ప్రతి పైసా ప్రతి సభ్యుడికి హక్కు వుంటుంది అని పేర్కొన్నారు. పన్ను విధింపులో కూడా ఆర్ బి ఐ వ్యత్యాసం చూపించింది అన్నారు. ఆదాయ పన్ను విషయంలో కార్పొరేట్ బ్యాంకులకు తక్కువ స్థాయి లోనూ, సహకార బ్యాంకులకు ఎక్కువ స్థాయిలో విధించడం జరిగింది అన్నారు. సహకార బ్యాంకింగ్ వ్యవస్థ లోని అందరి పోరాట ఫలితంగా ఆదాయ పన్ను 25 శాతానికి తగ్గించడం జరిగిందన్నారు. వైజాగ్ కో ఆపరేటివ్ బ్యాంక్ ఆధ్వర్యంలో సభ్యులుగా ఉన్న వారి పిల్లలు చదువులకు, మరణించిన సభ్యుల వారసులకు సంక్షేమ నిధి నుండి డబ్బులు ఇవ్వడం జరుగుతోందని తెలిపారు. గత సంవత్సరం 5.5 కోట్ల రూపాయలు బ్యాంకు సభ్యుల సంక్షేమానికి కేటాయించడం జరిగిందని పేర్కొ న్నారు. సభ్యుల ఆరోగ్య బీమా పథకాన్ని స్వత హాగా నిర్వహించు కోవడానికి వున్న అవకా శాల్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. బ్యాంకు సభ్యుల సంఖ్యతో పాటు షేర్‌లు పెంచుకో వాలని కోరారు. దేశంలో ఉన్న సహకార బ్యాంకు లలో వైజాగ్ కో ఆపరేటివ్ బ్యాంక్ నాలుగవ స్థానంలో నిలిచిందని చెప్పారు. దీనిని మరింత అభివృద్ధి చేయడానికి సభ్యులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో బ్యాంక్ జోనల్ మేనేజర్ వెంకటేశు, బ్రాంచ్ మేనేజర్ సునీత, పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

**వరంగల్, మే26(నిఘా న్యూస్):** తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక తుది అంకానికి చేరుకుంది. ప్రచారానికి గడువు ముగియడంతో ఇక అందరి దృష్టి పోలింగ్‌పై పడింది. మే 27వ తేదీన ఉదయం 8గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. సాయంత్రం నాలుగింటికి ముగియనుంది. పోలింగ్ కోసం ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. జిల్లాల కేంద్రాల్లో బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేస్తున్నారు. పోలింగ్ రోజు ఉదయం 6 నుంచి రాత్రి 8గంటల వరకు 144 సెక్షన్ అమలు చేయనున్నారు. 48 గంటలపాటు వైన్ షాపులు బంద్ చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 52మంది బరిలో ఉన్నారు. జంబో బ్యాలెట్ పేపర్‌తో పోలింగ్ నిర్వహించనున్నారు ఎన్నికల అధికారులు. మొత్తం 4లక్షల 63వేల 839 మంది ఓటర్లు ఉండగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో లక్షా 73వేల 406మంది, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో లక్షా 23వేల 985, ఉమ్మడి నల్గొండ జిల్లాలో లక్షా 66వేల 448 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. 605 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో 34 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద పోలింగ్ సామాగ్రి పంపిణీ చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. రేపు జరిగే పోలింగ్ కు అధికార యంత్రాంగం చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రచారం ముగించిన అభ్యర్థులు ఇక పట్టభద్రుల ఆశీస్సుల కోసం ఎదురు చూస్తున్నారు.

## తిరుమలలో హనుమాన్ జయంతి ఉత్సవాలు

(మొదటిపేజీ తరువాయి)

10 గంటల వరకు అభిషేకం జరుగుతుందని ఆలయ అర్చకులు వివరించారు. తొలిరోజు మల్లెపూలతో, జూన్ 2న తమలపాకులతో, 8న ఎర్ర నేరియం, కనకాంబరం పూలతో అమ్మవారికి మహా అభిషేకం, నాల్గవ రోజు చామంతితో, చివరి రోజు సింధూరంతో అభిషేకం కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

**తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ**


తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. నిన్న స్వామివారిని 83,866 మంది భక్తులు దర్శించుకోగా, 44,479 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.15 కోట్లు వచ్చిందని టీటీడీ అధికారులు తెలిపారు. టోకెన్లు భక్తులకు 20 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని వివరించారు.

## పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుపై ఈసీ స్పష్టమైన ఆదేశాలు జారీ

(మొదటిపేజీ తరువాయి)

సమయంలో ఫారం 13ఏ పై పోలింగ్ బూత్‌లో ఉన్న గెజిటెడ్ అధికారి సంతకంతో పాటు సీల్ కూడా వేయాలి. కానీ చాలాచోట్ల గెజిటెడ్ అధికారులు సీల్ వేయలేదు. అయినప్పటికీ సంబంధిత అధికారి సంతకంతో పాటు అతని వివరాలు ఉంటే అలాంటి ఓట్లను కచ్చితంగా పరిగణలోకి తీసుకోవాలని ఈసీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సీల్ లేదనే కారణంతో చెల్లని ఓట్లుగా పరిగణించవద్దని ఆదేశించింది. ఇక బ్యాలెట్ పేపర్ వెనుక ఎన్నికల రిటర్నింగ్ అధికారి సంతకం లేకపోయినా ఆ బ్యాలెట్ చెల్లుతుందని స్పష్టం చేసింది. పోస్టల్ బ్యాలెట్ కవర్ ఫారం సీ ఓటర్ సంతకం లేదని బ్యాలెట్‌ను తిరస్కరించవద్దని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఇక పోస్టల్ బ్యాలెట్‌లో ఒక అభ్యర్థి ఎదురుగా టిక్ మార్క్ పెట్టకున్నా, బ్యాలెట్ చిరిగిన, ఒకరికంటే ఎక్కువ అభ్యర్థుల ఎదుట ఉన్న అలాంటి ఓట్లను చెల్లనివిగా పరిగణించాలని సూచించింది.

## 'ఇండియా కూటమికి ఓటేస్తే వృథా'




(మొదటిపేజీ తరువాయి)

అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు మోదీ. బాల్యంలో తాను ప్లేట్లు కడిగానని, రైలులో చాయ్ అమ్మానని తెలిపారు మోదీ. ఇప్పటికి కూడా తనకు చాయ్ అంటే చాలా ఇష్టమన్నారు. ఉదయం కమలం వికసిస్తుందని , అదే సమయంలో అందరూ టీ తాగుతారని అందుకే బీజేపీకి దీంతో ఎంతో అనుబంధం ఉందన్నారు మోదీ. యూపీలో సమాజ్‌వాదీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మాఫియా రాజ్ నడిచిందన్నారు మోదీ. యోగి సీఎం అయ్యాక మాఫియాపై ఉక్కుపాదం మోపారని , శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయన్నారు. మిర్జాపూర్ సభలో కేంద్రమంత్రి అనుప్రియా పటేల్‌కు మద్దతుగా మోదీ ప్రచారం చేశారు. మత ప్రాతిపదిక రిజర్వేషన్లు అమలు చేసేందుకు రాజ్యాంగాన్ని మార్చేందుకు ఇండియా కూటమి కుట్ర చేస్తోందన్నారు మోదీ. అయితే ప్రధాని విమర్శలకు ఘాటైన కౌంటరిచ్చారు కాంగ్రెస్ నేత ప్రియాంకాగాంధీ. పంజాబ్‌లో ఆమె ప్రచారాన్ని హోరెత్తించారు. చండీఘడ్ , పాటియాలాలో కాంగ్రెస్ అభ్యర్థుల తరపున ప్రచారం చేశారు ప్రియాంక. మతరాజకీయాలు చేసి ప్రధాని మోదీ రెండుసార్లు అధికారం లోకి వచ్చారని , ఇప్పుడు కూడా అదే పంథాను ఎంచుకున్నారని విమర్శించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని చెప్పి ఆ విషయాన్ని మర్చిపోయారని అన్నారు ప్రియాంక.

## పారిశ్రామిక వాడల సమస్యల పరిష్కారానికి కృషి

### ఇండస్ట్రియల్ ఎండీ ని కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే



**ఉప్పల్, మే 26 (నిఘా న్యూస్):** బషీర్ బాగ్ లోని తెలంగాణ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ విష్ణు వర్ధన్ రెడ్డిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ఉప్పల్, నాచారం, మల్లాపూర్, చర్లపల్లి, కుషాయిగూడ తదితర ప్రాంతాల పరిశ్రమల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ సందర్భగా ఎండీ విష్ణు వర్ధన్ రెడ్డి సానుకూలంగా స్పందించి తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ఏ ఎస్ రావు నగర్ డివిజన్ ప్రెసిడెంట్ కాసం మహిపాల్ రెడ్డి, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన కూచిపూడి నృత్యోత్సవం




**ఉప్పల్, మే 26 (నిఘా న్యూస్):** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం నర్తనకేళి ఆర్ట్స్ అకాడమీ వంగిపురం నవ్య భారతి శిష్య బృందం కూచిపూడి నృత్యోత్సవం నిర్వహించారు. ఊతుకాడు వెంకట సుబ్బా అయెర్, రామదాసు కీర్తనం గీతం కొలువైతివా రంగ సాయి నోటుస్వరం స్వరపల్లవి శివ తాండవం మొదలైన అంశాలను లాస్య ప్రియా, అఖిల, హరిచందన, వాసవి రితిక, కావ్య, అభిజ్ఞ, శాన్వి, ప్రణవి, కావ్య, దీత్య నందన్, మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు. డాక్టర్ వాంగిపురం నీరజ దేవి, యక్షగాన కంఠీరవ డాక్టర్ పసుమర్తి శేషు బాబు, సంగీత నాటక అకాడమీ అవార్డీ డాక్టర్ రాధేశ్యామ్ లు ముఖ్య అతిథులుగా విచ్చేసి కళాకారులను సత్కరించారు.

## గుర్తు తెలియని మృతదేహం



**మనోహరాబాద్, మే 26 (నిఘా న్యూస్):** మనోహరాబాద్ రైల్వే స్టేషన్ నుండి గజ్వేల్ రైల్వే స్టేషన్ మార్గ మధ్యలో రామాయపల్లి విలేజ్ దగ్గరలో ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి శవమును గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. సుమారు వయసు 55 సంవత్సరముల నుండి 60 సంవత్సరముల మధ్య ఉన్నవ్యక్తి శవం లభ్యం అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. పోలీసులు ఘటన స్థలికి చేరుకొని శవాన్ని పరిశీలన చేసి పంచనామ నిర్వహించారు.

## కనకాపూర్ లో కరెంటు కష్టాలు



**లోకేశ్వరం, మే 26 (నిఘా న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడిచిన ప్రజలకు అందించే పథకాల్లో ఎంతో విఫలమైతుందని పలువురు పేర్కొంటున్నారు. లోకేశ్వరం మండలంలోని అబ్దుల్లాపూర్ సబ్ స్టేషన్ నుండి సప్లై అయ్యే కరెంటు కనకాపూర్ లో రెండు రోజుల నుండి కరెంటు కష్టాలు తీవ్రంగా ఉంటున్నాయని గ్రామ వాసులు పేర్కొంటున్నారు.పగలు రాత్రుల్లో కరెంటు 7 గంటల నుండి 12 గంటల వరకు వచ్చిన దాఖలాలు కనిపించడం లేదు.దీంతో ప్రతిరోజు తాగునీటి కష్టాలు చిన్నపిల్లలు,వృద్ధులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సంబంధిత విద్యుత్ శాఖ వివరణ కోరగా చిత్ర విచిత్రమైన సమాధానాలు చెబుతున్నారు.ఏది ఏమైనాప్పటికీ గత రెండు మూడు రోజులుగా కనకాపూర్ గ్రామానికి కరెంటు కష్టాలు తీవ్రంగా ఉండడంపై విద్యుత్ శాఖ సిబ్బందిపై గ్రామ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ట్రాన్స్ జెండర్స్ ఉపాధికి బాటలు

### 6 మాసాల క్రితమే ప్రతిపాదనలకు శ్రీకారం

### త్వరలో పెట్రోల్ పంప్ ఏర్పాటుకు చర్యలు



ముస్తాబాద్ సిరిసిల్ల, మే 26 (నిఘా న్యూస్): రాష్ట్రంలోనే ప్రపథమంగా ట్రాన్స్ జెండర్ల ఆర్థిక స్వావలంబన, స్వయం అభివృద్ధికి ప్రభుత్వం జనవరిలో ప్రతిపాదనలకు శ్రీకారం చుట్టింది. ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు.. ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లేందుకు మార్గం సుగమం అయింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పెట్రోల్ పంప్ త్వరలో ఏర్పాటు కానుంది. జిల్లాలోని ట్రాన్స్ జెండర్ లకు మంచి అవకాశాలు అందించేందుకు పెట్రోల్ పంప్ ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించడం జరిగింది. అనంతరం ఫిబ్రవరి మాసంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశంలో ఈ అంశాన్ని జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టితో వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వీ-హబ్ తో ఒప్పందం ట్రాన్స్ జెండర్లకు సమాన అవకాశాల చట్టం ప్రకారం రాజన్న సిరిసిల్ల జిల్లా యంత్రాంగం కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాల మేరకు వారి సంక్షేమానికి కృషి చేస్తున్నది.జిల్లాలో ఇప్పటివరకు 25 మంది ట్రాన్స్ జెండర్లకు గుర్తింపు కార్డులు జారీ చేశారు. వారి స్వయం ఉపాధి కోసం వివిధ రకాల శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసేందుకు వీ-హబ్ తో ఒప్పందం చేసుకోవడం జరుగుతున్నది. పెట్రోల్ పంప్ ఏర్పాటుకు ఎన్.ఓ.సీ ట్రాన్స్ జెండర్లు సమాజంలో మంచి అవకాశాలతో జీవించేందుకు. అలాగే పునరావాసం కోసం దీర్ఘకాలిక లక్ష్యంతో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఒక పెట్రోల్ పంపు ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. దీనికి సంబంధించిన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్.ఓ.సీ) ఇవ్వడం జరిగింది. ఇండియన్ ఆయిల్ కంపెనీ వారు ఇక్కడ పెట్రోల్ పంప్ ను మంజూరు చేశారు. ప్రస్తుతం జిల్లా కేంద్రం రెండో బైపాస్ లోని వైద్య కళాశాల ఎదురుగా ఉన్న వి.వింగ్ పార్కులో వీటికి సంబంధించిన నిర్మాణ కార్యక్రమాలు మొదలు పెట్టేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కలెక్టర్ అనురాగ్ జయంతి పర్యవేక్షణలో కార్యక్రమాలు చురుగ్గా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం నిర్మాణ దశలో ఈ కార్యక్రమాలు ఉన్నాయి. పెట్రోల్ పంపును దాదాపు రూ. మూడు కోట్ల వ్యయంతో నిర్మించబోతున్నారు. దీని నిర్మాణంతో ఈ పంప్ లో 15 మంది ట్రాన్స్ జెండర్ల కు ప్రత్యక్ష ఉపాధి లభించనుండగా, మరో పదిమందికి పరోక్షంగా ఉపాధి లభించే అవకాశాలు ఉన్నాయి. ఇందులో భాగంగా జిల్లాలోని ట్రాన్స్ జెండర్ల కు అదనపు కలెక్టర్ (స్తానిక సంస్థలు) పూజారి గౌతమి అవగాహన కార్యక్రమాలను ఇటివల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించారు. పెట్రోల్ పంప్ నిర్వహణ పై ట్రాన్స్ జెండర్ల కు త్వరలో శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ మేరకు జిల్లా సంక్షేమ అధికారి (నోడల్ ఆఫీసర్) లక్ష్మీరాజం ప్రణాళిక రూపొందిస్తున్నారు.

# ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

### విజేతగా నారాయణరావు పేట జట్టు

### మాజీ సర్పంచుల చేతుల మీదుగా కప్ అందజేత



**ముస్తాబాద్, మే 26 (నిఘా న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామానికి చెందిన వరి చంద్రమోహన్ గత రెండు నెలల క్రితం ఆకస్మిక మరణం చెందాడు. అతని జ్ఞాపకార్థం జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ గ్రామంలోని మైదానంలో జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల నిర్వహించడం జరిగింది. 40 జట్లు ఈ క్రిడలో పాల్గొన్నాయి. ఆదివారం ఫైనల్ మ్యాచ్ లో సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట గ్రామం విజేతగా నిలిచింది.అలాగే పోతుగల్ వారు రన్నరప్ గా నిలిచారు. విజేతగా నిలిచిన మొదటి జట్టుకు పోతుగల్ గ్రామ మాజీ సర్పంచులు తన్నీరు గౌతమ్ రావు, ద్యావత్ పందరి, బిజెపి నాయకుడు కోల కృష్ణగౌడ్, మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్, వెన్నమనేని పూర్ణచంద్రరావు, చీటీ జితేందర్ రావు, తోట ధర్మేందర్, గాన్నేవానిపల్లె శ్రీకాంత్, బందనకల్ గ్రామ ఉపసర్పంచ్ కార్తిక్ రెడ్డి చేతుల మీదుగా 25 వేల రూపాయలతో పాటు రన్నరప్ టీమ్ వారికి 15 వేల రూపాయలు ఇవ్వడం బహుమానం జరిగింది.మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ద సిరిస్ నారాయణరావుపేట జట్టు సభ్యుడు మనీష్ కి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పెద్దలు ఎలాంటి గోడవలు లేకుండా విజయవంతంగా టోర్నమెంట్ నిర్వహించిన ఆర్గనైజర్లు వరి వెంకటేష్,ఆది శేఖర్,కొడిముంజ శ్రీనివాస్,దేశెట్టి నాని, బాను,నవీన్ లను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పోతుగల్ గ్రామ యువకులు నాయకులు గోద శ్రీనివాస్ వెంకట్రాజం విద్యాధర్ బాలయ్య బాలయ్య కంచం శ్రీశైలం కనకయ్య మైసమ్మ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో మోహన్స్ డయాబెటిస్ ఎక్స్ పో-2024



**హైదరాబాద్, మే 26 (నిఘా న్యూస్):** మధుమేహ వ్యాధిని తగ్గించడం, జీవనశైలి మార్పుల గురించి అవగాహన కల్పించడం అనే తన ఆశయంలో భాగంగా డాక్టర్ మోహన్స్ డయాబెటిస్ స్పెషాలిటీస్ సెంటర్(డిఎండిఎస్సీ) ఆదివారం నగరంలో అతిపెద్ద డయాబెటిస్ ఎక్స్ పోను ప్రారంభించి. 10 వేలకు మందికి పైగా పాల్గొన్న ఈ ఎక్స్ పోలో ప్రముఖ వైద్యులు, డయాబెటాలజిస్టులు, రోగులు మధుమేహ ముందస్తు నివారణ చర్యలు, వ్యాధి నిర్వహణలో సంభవిస్తున్న తాజా సాంకేతిక పురోగతుల గురించి తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ మోహన్స్ డయాబెటిస్ స్పెషాలిటీస్ సెంటర్ చైర్మన్, చీఫ్ డయాబెటాలజిస్ట్, ప్రపంచ ప్రసిద్ధి చెందిన డయాబెటాలజిస్ట్ డాక్టర్ వి.మోహన్, డాక్టర్ మోహన్స్ డయాబెటిస్ స్పెషాలిటీస్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ఎం.అంజన, ఇతర ప్రముఖుల సమక్షంలో భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ, ఏసియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, ఎఐజి హాస్పిటల్స్ హైదరాబాద్ చైర్మన్, గ్యాస్ట్రో ఎంటరాలజీ చీఫ్ డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డి, డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీస్ చైర్మన్ కె.సతీష్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డయాబెటాలజిస్ట్, ఉస్మానియా వైద్య కళాశాల డిపార్ట్ మెంట్ ఆఫ్ మెడిసిన్ మాజీ ప్రొఫెసర్, అధిపతి ప్రొఫెసర్ బికె.సహాయ్ ని డయాబెటాలజీ రంగంలో ఆయన అందించిన అపారమైన సేవలను గుర్తిస్తూ జీవితకాల సాఫల్య పురస్కారంతో సత్కరించారు.

# మద్దె బోయినకు విప్లవ జోహార్లు

### సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్



**పాలేరు, మే 26 (నిఘా న్యూస్):** భూమికోసం, భుక్తి కోసం, ఈ దేశం విముక్తి కోసం ఎందరో అమర వీరులు అమరులయ్యారని వారి ఆశయ సాధనలోనే చివరకంటూ పోరాడి అనారోగ్యంతో తన తుది శ్వాస విడిచిన మదే బోయిన సత్యనారాయణ, అలియాస్ పూసలి నారాయణకు సిపిఐ (ఎంఎల్)మాస్ లైన్ జిల్లా సెక్రటేరియట్ సభ్యులు రేపాకుల శివలింగం, కమ్మ కోమటి నాగేశ్వరరావు, విప్లవ జోహార్లు అర్పించారు. వారి మరణ వార్త తెలవగానే తిరుమలాయపాలెం మండలం బీరోలు గ్రామం వచ్చి వారి కుటుంబాన్ని ఓదార్చి సంతాప సానుభూతిని తెలియజేశారు. బీరోలు గ్రామంలో భూస్వామి పెత్తందారి దొరలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో కామ్రేడ్ నారాయణ, కామ్రేడ్ పేరం దశరథ్, కామ్రేడ్ సోమన్న. కొప్పుల చెన్న కృష్ణారెడ్డి, చారి, వెంకన్న ల నాయకత్వంలో పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇప్పించి భూస్వామికి వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేసిన నాయకుడు నారాయణ అని అన్నారు. ఆనాటి ప్రజాపంద పార్టీ బీరోలు గ్రామంలో నారాయణ ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొని. అక్రమ కేసులను లెక్కచేయకుండా పేద ప్రజల కోసం ప్రజాపంద పోరాటాలలో ముందు బాగానే నిలిచాడని అన్నారు. ఆనాడు రహస్య నాయకులు ఎంత మంది వచ్చినా తన ఇంట్లో ఆశ్రయించేవాడని పార్టీ రహస్య నాయకులకు ఆనాడు ఒక విప్లవ కేంద్రంగా నారాయణ ఇల్లు ఉండేదని వారు గుర్తు చేశారు. బీరోలు గ్రామ అభివృద్ధిలో తన పాత్ర మరువలేనిదని విప్లవోద్యమ నికి నారాయణ తీరని లోటని అన్నారు. మద్యపాన వ్యతిరేక ఉద్యమంలో గ్రామానికి నిధులు వచ్చే విధంగా అభివృద్ధి చేసిన నారాయణ మరణం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీకి తీరని లోటని వారన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విప్లవద్యంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని భూస్వామ్య దౌర్జన్యాలకు వ్యతిరేకంగా అక్రమ కేసులకు గురై భూస్వామి పెత్తందారులకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో నారాయణ సేవలు మరువలేని అన్నారు. ఈ కార్యక్రమానికి పేరం దశరథ ఉద్యమ సహచరుడు అధ్యక్ష వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకుడు తిమ్మిడి హనుమంతరావు, సోమనపల్లి వెంకటేశ్వర్లు కార్యదర్శి. న్యూ డెమోక్రసీ నాయకులు బ్రహ్మచారి, పేరం పట్టాభి, మంగయ్య, వీరన్న, వెంకన్న, వారి కుటుంబ సభ్యులు ఈ సంతాప సభలో పాల్గొన్నారు.

## హెచ్ బి కాలనీలో పర్యటించిన కార్పొరేటర్



**మౌలాలి, మే 26 (నిఘా న్యూస్):** మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ పరిధిలోనీ హెచ్ బీ కాలనీ ఫేజ్-2 లో తాగునీరు, డ్రైనేజీ, ఇతర స్థానిక సమస్యల నిమిత్తం పర్యటించిన కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీవాసులు లేవనెత్తిన సమస్యలపై సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ మున్సిపల్ సిబ్బందికి జలమండలి శాఖకు సమన్వయం చేస్తూ, పూర్తి సహకారం ఉంటుందని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కె.వెంకటాచారి సలహాదారులు కె.చంద్రమోహన్, ఉపాధ్యక్షులు పిఎన్. జగదీశ్వర్, ఎస్. భువనచంద్ర, ప్రధాన కార్యదర్శి ఆర్. వి.సాంబ శివరావు, సంయుక్త కార్యదర్శులు యు. ఈశ్వరరావు, పి.వెంకటేశం, ఈ.రామచంద్రారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్ బాబు, కే.మధుబాబు, డి.సురేష్, కోశాధికారి టి.నరేందర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, లక్ష్మి కాలనీవాసులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



**హబ్సిగూడ, మే 26 (నిఘా న్యూస్):** శాఖపరమైన మర మ్మత్తుల కారణంగా ఈనెల 27 వ తేదీ సోమవారం హబ్సిగూడ సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంత రాయం కలుగుతుందని హబ్సిగూడ విద్యుత్ శాఖ ఏ ఏ ఈ ఎన్. రాంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11 కెవి స్నేహపురి కాలనీ ఫీడర్ ఐ ఐ సి టి సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. ఆ సమయంలో స్నేహపురి కాలనీ వి ఎస్ టి కాలనీ శ్రీనగర్ భవాని నగర్ స్ట్రీట్ నెంబర్ 3 నుండి 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదని వెల్లడించారు. 11 కెవి హెచ్ ఎం టి నగర్ ఫీడర్, ఐఐసిటి సబ్ స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం ఒంటిగంట నుండి రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వివరించారు. 11 కెవి హెచ్ ఎం డబ్ల్యు ఎస్ పెద్ద చెరువు ఎన్ జి ఆర్ ఐ సబ్ స్టేషన్ పరిధిలో సాయంత్రం మూడున్నర గంటల నుండి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు వ్యాపారస్తులు తమతో తమ సిబ్బందితో సహకరించాలని ఏ.ఏ. ఈ ఎన్. రాంరెడ్డి విజ్ఞప్తి చేశారు

## బీమా చెక్కు అందజేత



**తూప్రాన్, మే 26 (నిఘా న్యూస్):** ప్రతి వ్యక్తి జీవిత భీమా పాలసీ చేసుకుంటే ఆ కుటుంబానికి ఇన్సూరెన్స్ పాలసీ కొండంత అండాగా నిలుస్తుంది అని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, హైదరాబాద్ జోన్ డీజీఎం నరేందర్ అన్నారు. నీలా రాఘవులు ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ కు గురై మృతి చెందడము జరిగినది. ఇతనికి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ మెదక్ బ్రాంచ్ లో ఇన్సూరెన్స్ పాలసీ వున్నదున ఇతనికి 5లక్షల 64, వేల 750రూ బీమా చెక్కును డీజీఎం నరేందర్ నామినిగా ఉన్న నీలా లక్ష్మికి అందచేశారు. ఈపాలసీని ప్రీమియం 32 వేల రూపాయలతో తీసుకోవడము జరిగినది. పాలసీ తీసుకున్న రెండు సంవత్సరాల లోపు ఈ మరణం సభవించినందున చెక్ ను అందచేసారు. ఈకార్య క్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ డీజీఎం నరేందర్, ఆర్ ఎం విజయ్, బ్రాంచ్ మేనేజర్ శ్రీమతి విమల దేవి, డివో అనిల్ రెడ్డి, స్థానిక సర్పంచ్, ఎస్ ఓ శ్రీమతి విజయ రెడ్డి, వీడీసీ అధ్యక్షులు డి. సుభాష్, స్థానిక గ్రామ ప్రజలు, డి ఓ నార్ల మల్లేష్, బిడిఈ సత్యనారాయణ గౌడ్ బ్రాంచ్ సిబ్బంది ఉన్నారు.

## నెట్ బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు



**నాగార్జునసాగర్, మే 26 (నిఘా న్యూస్):** నాగార్జునసాగర్ హిల్ కాలనీ లో గల సెయింట్ జోసెఫ్ హై స్కూల్ నందు ఆదివారం జరిగిన జిల్లాస్థాయి సీనియర్ నెట్ బాల్ సెలక్షన్స్ కు సుమారు 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు వీరిలో 12మంది బాలురు12 మంది బాలికలు రాష్ట్రస్థాయి టోర్నమెంట్కు ఎంపికైనట్లు నల్లగొండ జిల్లా నెట్ బాల్ అసోసియేషన్ సెక్రెటరీ జె కిరణ్ కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం సాగర్(నందికొండ)పట్టణ అధ్యక్షుడు మోహన్ నాయక్, హిల్ కాలనీ టౌన్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ బాలాజీ నాయక్ పాల్గొని క్రీడాకారులను అభినందించారు. అలాగే సీనియర్ క్రీడాకారులు అయినటువంటి సంయుత్ నాయుడు, ధనుష్ నాయక్ ఎంపికైన క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఈనెల 30వ తారీకు నుంచి ఒకటవ తారీకు వరకు హైదరాబాదులోని దోమలగూడలో జరిగే రాష్ట్రస్థాయి నెట్ బాల్ టోర్నమెంట్ కు వెళ్ళనున్నారు.



ముదిరాజ్ సేవా సమితి ఆధ్వర్యంలో పదవ తరగతి, ఇంటర్ ఫలితాల్లోఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాజన్న సిరిసిల్లలో సత్కరించారు.విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతమైన ఉద్యోగాల్లో స్థిరపడాలని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సేవాసమితి వ్యవస్థాకుడి జెల్ల వెంకటస్వామి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు కనకయ్య,రాము యాదగిరి, భద్రాచలం, నరేష్, లక్ష్మి రాజం,నరేష్,బిక్షపతి,బాబు తదితరులు హాజరయ్యారు.

*-ముస్తాబాద్, మే 26 (నిఘా న్యూస్):*

## ఘనంగా హనుమాన్ సంకీర్తన



**దేవరుప్పుల, మార్చి 27 (నిఘా న్యూస్):** దేవరుప్పుల మండలం బంజర గ్రామంలో హనుమాన్ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన హనుమాన్ భక్తులు 41 రోజులు దీక్ష చేపట్టి నగర సంకీర్తనను(శోభాయాత్ర) ఘనంగా నిర్వహించారు.హనుమాన్ జయంతి రోజు మాలాధారణ ధరించిన హనుమాన్ భక్తులు భక్తి శ్రద్ధలతో దీక్షలో ఉండి పూజలు జరుపుతున్నారు.ఇందులో భాగంగా ఆదివారం హనుమాన్ గుడి నుండి నగర సంకీర్తన, గ్రామంలోని ప్రతి వీధి వీధికి తిరిగి భక్తిశ్రద్ధలతో భజనలతో శుభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంజనేయ స్వామి ఆశీస్సులతో గ్రామ ప్రజలు అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని గొడ్డు గోదా సల్లంగా ఉండాలని, ఆ స్వామి కృపతో అందరూ బాగుండాలనివేడుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దీకొండ విష్ణు, జటంగి చిన్న వీరయ్య పరశురాములు, వినయ్, వడ్లకొండ రాజు పడకంటి. బ్రహ్మచారి, జోగు.అర్జున్, విక్రం, పట్టూరి గంగయ్య, గుగులోతు నరేందర్, మాలోతు. మధుసూదన్, మెడ గుజ్జుల. శేఖర్, భూక్య నర్సింగ్, ధరావత్ శ్రీహరి, ధరావత్ గణపతి, చింతల సంపత్ మరియు గ్రామ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలకు కాంగ్రెస్ అభిమాని సైకిల్ యాత్ర



**పెద్దపల్లి, మే 26 (నిఘా న్యూస్):** లాలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిగుర్ల జగ్గయ్య,చింతకుంట విజయరమణ రావు పెద్దపల్లి శాసనసభ్యులుగా గెలుపొందిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం తిరుమల తిరుపతి దేవస్థానం వరకు సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నారు. దానికి గాను ఎమ్మెల్యే విజయరమణ రావు శివపల్లి గ్రామంలోని వారి నివాసం వద్ద నుండి తన అభిమాని జగ్గయ్య సైకిల్ యాత్ర విజయవంతం కావాలని, ఎలాంటి ఆటంకాలు ఎదురవ్వకుండా ఉండాలని ఆ భగవంతుడిని ప్రార్థించి కొబ్బరికాయ కొట్టిన జగ్గయ్య తిరుమలకు వెళ్ళే సైకిల్ యాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎలిగేడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సామా రాజేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులకు హెచ్చరిక



**విశాఖపట్నం, మే 26 (నిఘా న్యూస్):** విశాఖలో నో పార్కింగ్ లో వాహనాలు పెట్టే వారిపై కొరడా ఝులిపించారు. నో పార్కింగ్ తో పార్క్ చేసే వాహనాలకు వీల్ లాక్ చేసి 1,035 చెల్లించాకే తిరిగి బండి అప్పగించారు. ప్రజలకు ట్రాఫిక్ పై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. రహదారి భద్రత పాటించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీపీ రవిశంకర్ తెలిపారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలి

### స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



**వికారాబాద్, మే 26 (నిఘా న్యూస్):** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని సాకేత్ నగర్ లోని అలోక పాఠశాల యాజమాన్యం నూతన భవనం నిర్మించగా, ముఖ్య అతిథులుగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, వికారాబాద్ మున్సిపల్ చైర్మన్ చిగుళ్లపల్లి మంజుల పాల్గొని నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా గ్రామీణ ప్రాంత ప్రజలతో కూడుకున్నది కావున ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం సతీష్, ప్రిన్సిపల్ గీతా జోషి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎన్నికల మార్గదర్శకాలను పాటించాలి





### జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్

**ఖమ్మం, మే 26 (నిఘా న్యూస్):** ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పోలింగ్ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వి.పి..గౌతమ్ అన్నారు. వరంగల్ -ఖమ్మం -నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నికను పురస్కరించుకొని ఆదివారం స్థానిక ఎస్ఆర్ అండ్ బిజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలింగ్ సిబ్బంది స్వీకరిస్తున్న పోలింగ్ మెటీరియల్ ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తి పోలింగ్ సామాగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకొని, ఆదివారం రాత్రి పోలింగ్ కేంద్రాలలోనే బస చేయాలని, సోమవారం నాటి పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. ఉదయం 8.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు పట్టభద్రుల ఉప ఎన్నిక పోలింగ్ జరుగుతుందని ఆయన తెలిపారు. ఉదయం 7.30 గంటల కల్లా పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో జంబో బాక్సుల సీలింగ్ ప్రక్రియ చేపట్టాలన్నారు. జంబో బాక్సు ఖాళీగా ఉన్నట్లు చూపించి, అడ్రస్ ట్యాగ్ చేయాలని, బాక్స్ మూతపెట్టి 2 తాళాలు వేసి, స్టిక్కర్ చేయాలని ఆయన తెలిపారు. పోలింగ్ కేంద్రంలో 800 ఓట్ల కంటే ఎక్కువ ఓట్లు ఉంటే, 2 ఓటింగ్ కాంపార్టుమెంట్ లు ఏర్పాటుచేసుకోవాలని ఆయన తెలిపారు. బాక్సుల సీలింగ్ పై పూర్తి అవగాహన కల్గివుండాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, జిల్లా రెవిన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి ఆర్డీవోలు జి.గణేష్, ఎల్.రాజేందర్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శ్రీలత, జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకులు కె.శ్రీరామ్, మదన్ గోపాల్, కలెక్టరేట్ ఏవో అరుణ, ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు తహశీల్దార్లు అధికారులు తదితరులు ఉన్నారు.

# తీన్మార్ మల్లన్నను గెలిపించండి



### పట్టభద్రులకు కాంగ్రెస్ నేతల వినతి

**నల్లకుంట, మే 26 (నిఘా న్యూస్):** ఖమ్మం,నల్గొండ, వరంగల్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ అక్రమంగా సంపాదించిన డబ్బులతో గెలవాలని ప్రయత్నిస్తుందని అంబర్ పేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆరోపించారు. ఆ డబ్బు ప్రజల డబ్బేనని, బిఆర్ఎస్ నేతలు ఇస్తున్న డబ్బులను తీసుకొని పట్టభద్రులు కాంగ్రెస్ బలపరుస్తున్న అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వారి మెజార్టీతో గెలిపించాలని వారి విజ్ఞప్తి చేశారు. ఆదివారం నల్లకుంట శంకర్ మట్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి అజయ్ కుమార్, రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ మాజీ చైర్మన్ జిబి శ్యామ్ రావు, టీపీసీసీ బీసీ సెల్ చైర్మన్ కట్టెల సుభాష్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవి రెడ్డి విజితారెడ్డి, హరినాథ్ రెడ్డి, ఎడ్ల నరేందర్ రెడ్డి,శరత్ ముదిరాజ్, సిహెచ్ మురళీకృష్ణ, గిరి, కాంతారావు, గోవర్ధన్ రెడ్డి, బొమ్మిడి శ్రవణ్ కుమార్ తదితరులు మాట్లాడారు. తీన్మార్ మల్లన్నకు మద్దతుగా తాము ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాలలో ప్రచారాన్ని నిర్వహించినట్లు వారు తెలిపారు. అక్కడి పట్టభద్రులందరూ తీన్మార్ మల్లన్న కు బ్రహ్మరథం పడుతున్నారని, ఆయనకి తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తామని చెబుతున్నారని వారు గుర్తు చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ బిట్స్ పిలానీ, పల్లి బఠాణి అంటూ తప్పుడు కూతలు కూస్తూ, ఉస్మానియా,కాకతీయ, జేఎన్టీయూ యూనివర్సిటీలలో చదివిన విద్యార్థులను అవమానపరిచాడని వారు ఆరోపించారు.ఈ యూనివర్సిటీలో చదివిన విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, అదే యూనివర్సిటీలో తీన్మార్ మల్లన్న ఉన్నత చదువులను అభ్యసించారని వారు గుర్తు చేశారు. ప్రజా గొంతుక తీన్మార్ మల్లన్న జర్నలిస్టుగా గత ప్రభుత్వ హాయంలో జరిగిన అక్రమాలను వెలికి తీసి ప్రజల ముందు ఉంచారని,ఇది భరించలేక అప్పటి పాలకులు ఆయన పై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపించారని వారు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి తీన్మార్ మల్లన్న తన వంతు కృషి చేశారని వారు తెలిపారు. యువత, నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలపై తీన్మార్ మల్లన్నకు పూర్తిస్థాయిలో అవగాహన ఉందని, ఆయనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు.


# ధూమపానంతో ప్రాణానికి ముప్పు

### జనరల్ మెడిసిన్ డాక్టర్ కడారి శ్రీజ



**వికారాబాద్, మే 26 (నిఘా న్యూస్):** తెలిసి తెలియని వయసులో యువకులు, నగరంలోని యువతులు ధూమపానం సరదాగా చేయడం మొదలు పెడతారని, అది కాస్త అలవాటుగా మారి, ధూమపానానికి బానిస అవుతారని తద్వారా భవిష్యత్తులో దీర్ఘకాలిక, ప్రాణాంతక రోగాలకు గురి అవుతున్నారని, వారి ఉజ్వల భవిష్యత్తుకు వారే అడ్డుకట్ట వేసుకుంటున్నారని జనరల్ మెడిసిన్ డాక్టర్ శ్రీజ యాదవ్ కడారి స్పష్టంగా వివరించారు. చెడు వ్యసనాలకు యువతి యువకులు దూరంగా ఉండటమే ఉత్తమమైన మార్గం అని హితవు పలికారు. ఈ సందర్భంగా జనరల్ మెడిసిన్ డాక్టర్ శ్రీజ యాదవ్ కడారి మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా కేంద్రంలోని జనరల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్, డాక్టర్ రామచంద్రయ్య ఆధ్వర్యంలో సంబంధిత వైద్య నిపుణులు రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని వెల్లడించారు. ధూమపానం చేయడంతో అనేక అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని తెలిపారు. ప్రధానంగా అధిక రక్తపోటుకు గురి కావడం ఖాయం అన్నారు. చిన్న వయసులో రక్తపోటుకు గురి కావడం మూలాన గుండెపోటు, కిడ్నీ సమస్యలు, కంటి చూపు కోల్పోవడం, అధిక రక్తపోటుతో రక్తనాళాలు చిట్లిపోవడం వలన పక్షవాతం రావడం, ఊపిరితిత్తుల సమస్యలు రావడం, బొక్కలు బలహీనమై, విరిగే అవకాశం ఉందని సూచించారు. దీంతోపాటు పలు రకాల క్యాన్సర్ కు గురి అవుతారని స్పష్టం చేశారు. నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, పేగులకు క్యాన్సర్, మూత్రాశయ క్యాన్సర్, ఇలా తదితర ప్రాణాంతక దీర్ఘకాలిక వ్యాధులకు గురి అవుతారని స్పష్టం చేశారు. ఒక కుటుంబంలో ఒకరు సిగరెట్ తాగిన దాని చెడు ఫలితాలు అందరిపై పడే అవకాశం ఉందని తెలిపారు. బాలికలు ధూమపానానికి అలవాటు అయితే భవిష్యత్తులో రక్తపోటుకు గురై గర్భవతిగా ఉన్నప్పుడు నెలలు నిండకుండానే ప్రసవం జరగడం, తక్కువ బరువుతో నవజాత శిశువు పుట్టడం, ఊపిరితిత్తుల అనారోగ్య సమస్యలు, అల్సర్ సమస్య, సర్వైకల్ క్యాన్సర్, తదితర అనారోగ్య సమస్యలకు గురి కావడం జరుగుతుందని సూచించారు. ప్రస్తుత కాలంలో 15 సంవత్సరాలు నిండిన యువతి యువకులు ధూమపానం కు అలవాటు పడడం వలన కలిగే అనర్థాలు, చెడు పరిణామాలు తెలుసుకోలేని, పరిపక్వత చెందని, మిడిమిడి జ్ఞానంతో ఉండి సరదాగా సిగరెట్లు, బీడీ, గంజాయి సేవించి, అలవాటుగా మారి, ధూమపానానికి బానిసలవుతున్నారని పేర్కొన్నారు. ధూమపానానికి అలవాటు అయిన వారు సంబంధిత డాక్టర్లను సంప్రదిస్తే తగిన మాత్రలు అందించి, ఆరోగ్య నియమావళిని అనుసరించి అవగాహన కల్పించి వారి చెడు అలవాట్లను దూరం చేస్తామని భరోసా కల్పించారు. ధూమపానం ఆపడానికి నికోటిన్ చుయింగ్ గంతో పాటు కొన్ని మాత్రలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ధూమపానం అలవాటైన యువకులకు ఆ చెడు వ్యసనంతొ మారడానికి స్నేహితులు, తల్లితండ్రులు, కుటుంబ సభ్యులు, సమాజం వారికి చిన్న చూపు చూడకుండా ముందుకు వచ్చి వారిని చెడు వ్యసనంతో దూరం చేయడానికి కృషి చేయాలని కోరారు. అందరూ ఆరోగ్య నియమావళి పాటించి, ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఆశాభావం వ్యక్తంచేశారు.

# నాణ్యమైన వైద్య సేవలు అందించాలి: మైనంపల్లి



**మల్కాజిగిరి, మే 26 (నిఘాన్యూస్):** పేదలకు స్వల్ప ఖర్చుతో నాణ్య మైన వైద్య సేవలు అందిం చాలని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సూచించారు. ఆదివారం ఆయన, వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని దినకర్ నగర్ లోని రెడ్డి కాంప్లెక్స్ లో నూతనంగా నిర్మించిన ఏ 1 కేర్ హాస్పిటల్'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మైనంపల్లి హన్మంత రావు మాట్లాడుతూ సేవా ధృక్పథంతో ఆసుపత్రి యాజమాన్యం స్థానికంగా ఉండే పేద మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులకు శుభాభి నందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ అశోక్, డాక్టర్ అఖిల, ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్, కాంగ్రెస్ బి బ్లాక్ అధ్యక్షుడు టి.వెంక టేష్ యాదవ్ సీనియర్ నేతలు జీఎన్ వీ సతీష్ కుమార్,బి కే శ్రీనివాస్, పిట్టల నాగరాజు, ఎస్ఆర్ ప్రసాద్, వినోద్ యాదవ్, సంజయ్, చంద్ర శేఖర్, సంతోష్ రాందాస్, సత్య నారాయణ, నవీన్ గౌడ్, రఘుయాదవ్, ధరణి కు మార్ తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి మండలం మొగలాయి కోట గ్రామానికి చెందిన వడ్డేపూడి. వీరబాబు రమణ కుమారులు నాగ ముకేష్ లాస్య నూతన వస్త్రాలంకరణ మహోత్సవ కార్యక్రమానికి శాంతినగర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్ రెడ్డి చిరంజీవులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు. కొండపల్లి వాసు,బుర్ర పుల్లారెడ్డి, దేగ కొండయ్య, ఎయిర్ ఫోర్స్ వెంకటరెడ్డి,అమీనాబాద్ గ్రామ మాజీ సర్పంచ్ ముత్తినేని కోటేశ్వరరావు, తూనం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

*-కోదాడ, మే 26 (నిఘా న్యూస్):*

## మారుతీ నగర్ కాలనీ అధ్యక్షుడిగా బండ అంజయ్య



**బోడుప్పల్, మే 26 (నిఘా న్యూస్):** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మారుతీ నగర్ కాలనీలో సంక్షేమ సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికలో అధ్యక్షునిగా బండ అంజయ్య యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మారుతీ నగర్ కాలనీ సంక్షేమ సంఘం వార్షిక సర్వసభ్య సమావేశం కాలనీ కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కాలనీ వార్షిక సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీకి ఎన్నికలు జరిగాయి. మారుతీ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా బండ అంజయ్య యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, ఉపాధ్యక్షులుగా కే.శ్రీనివాస్ రావు, నరహరి, ప్రధాన కార్యదర్శిగా నర్సిరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా రజనీకాంత్, కోశాధికారిగా ఉపేందర్‌లు ఎన్నికయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు బండ అంజయ్య యాదవ్ మాట్లాడుతూ కాలనీ సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని చిత్తశుద్ధితో పనిచేస్తానని, రాగద్వేషాలకు అతీతంగా అందర్నీ కలుపుకొని పోయి సమస్యలను పరిష్కరించడంలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మారుతి నగర్ కాలనీ సంక్షేమ సంఘం ముఖ్యులు, కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి పిఆర్ టియు సాయం



**తాండూరు, మే 26 (నిఘా న్యూస్):** బషీరాబాద్ మండల కేంద్రంలోని టాకీ తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు రాణి కొన్ని రోజుల క్రితం పార్లమెంట్ ఎన్నికల శిక్షణ కార్యక్రమంలో భాగంగా పాల్గొని తిరిగి వెళుతుండగా వడదెబ్బకు గుడి కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో రాష్ట్ర పిఆర్టియు సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు, గౌరవ అధ్యక్షులు, ప్రధాన ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యుల చేతుల మీదుగా ఉపాధ్యాయురాలు రాణి కుటుంబానికి ఆర్థిక సహాయం గా లక్ష రూపాయల చెక్కును అందించారు. ఈ సందర్భంగా పిఆర్టియు జిల్లా సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ ఉపాధ్యాయురాలు రాణి పిఆర్టియు సంఘంలో మండల కార్యవర్గ సభ్యులుగా ఉండేవారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కడియాల చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షులు వెంకట రామ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అమర్నాథ్, మండల అధ్యక్షులు నరసింహారెడ్డి, గౌరవ అధ్యక్షులు రవికాంత్, మండల విద్యాధికారి సుధాకర్ రెడ్డి, తదితర పిఆర్టియు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**కోరుకొండ, మే 26 (నిఘా న్యూస్):** కోరుకొండ మండలం కోరుకొండ నాగ సాయి ఫంక్షన్ హాల్ లోపూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనము1994-1995, 10 వ తరగతి విద్యార్థుల ఆత్మీయ కలయికశ్రీ అత్తిలి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీ రాజబాబు జూనియర్ కళాశాల (1990-1997) కోరుకొండది. ఆదివారం పూర్వ విధ్యార్థులు అందరికీ ఆత్మీయ కలయిక నిర్వహించారు. బ్యాచ్ లోని మిత్రులు సకుటుంబముగా వచ్చి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బొండాడు ,మధు, నాగ శేషగిరి, షేక్ సత్తార్, మర్ల సీతారామశాస్త్రి, నక్క ఆనంద్, పైడిమల్ల నరసింహారావు, ముడత లవకుశ దోర, బ్రహ్మానందం బ్రహ్మచారి బ్రహ్మచారి పాలక్షరావు వల్లభ రావు అవేక్ మూర్తి, రాజశేఖర్ పాల్గొని గురువులకు సన్మాన కార్యక్రమం నిర్వహించి గురువులు ఆశీస్సులు తీసుకున్నారు.

## కార్యకర్తలను పరామర్శించిన కొప్పుల



**ధర్మపురి, మే 26 (నిఘా న్యూస్):** నియోజకవర్గంలోని ధర్మారం మండలం రామయ్య పల్లి గ్రామ శాఖ అధ్యక్షులు మార్క బాలయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. మరియు రామయ్య పల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న బిఆర్ఎస్ నాయకులు మండల మల్లయ్య లను ఆదివారం మాజీ మంత్రి,పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకొని మనో ధైర్యం నింపి పరామర్శించారు.వారి వెంట మేడారం సింగల్ విండో చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి, ధర్మారం మాజీ సర్పంచ్ పుస్కూరి జితేందర్ రావు, మూల మల్లేశం,బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



నియోజకవర్గంలోని ఎండపల్లిలోని 132కె.వి.సబ్ స్టేషన్ లో మరమ్మత్తుల దృష్ట్యా నేటి సోమవారం ఉదయం 7గంటల నుండి11 గంటల వరకు ధర్మారం,మల్లాపూర్ కొత్తూరు సబ్ స్టేషన్ ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుంది. కావున వినియోగదారులు సహకరించగలరని విద్యుత్ ఏ.ఇ యం.డి ఖాసింఖాన్ కోరారు.

*-ధర్మపురి, మే 26 (నిఘా న్యూస్):*

## ప్రతిభ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**ధర్మపురి, మే 26 (నిఘా న్యూస్):** ధర్మారం మండలం కేంద్రంలోని ప్రతిభ అధ్యయన కేంద్రంలో ఆదివారం 2007-08 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించు కున్నారు. ఈ సమ్మేళనంలో విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.తాము చదివిన పాఠశాలలోని గురువుల బోధన వల్లే తాము ఉన్నత స్థానంలో నిలిచామని విద్యార్థులు తెలిపారు.ఆ రోజు చదువుకున్న విద్యార్థులు ఈరోజు వివిధ ఉన్నత స్థాయిలలో ఉన్నారు. దానికి అంతటికి తమ గురువుల ప్రోత్సాహమేనని వారన్నారు. ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి ఘనంగా శాలువాలతో సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన ప్రతిభా అధ్యయన కేంద్రం పాఠశాల కరస్పాండెంట్ బండారి గోపాల కిషన్, సుజాత,మహమ్మద్ ముస్తఫా ఖాన్, శంకరయ్య, భాస్కర్,తిరుపతి,భూమయ్య, సతీష్, కరుణాకర్, శ్రావణి ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలోఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు కూడా ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ సాయం



**కారేపల్లి, మే 26 (నిఘా న్యూస్):** సింగరేణి మండల గణేష్ సెంటర్ కు చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు, హమాలి మేస్త్రి పెద్దమ్మ బాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి చిత్రపటానికి నివాళులర్పించి వారి దశదినకర్మకు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు, సిపిఐ మండల సెక్రెటరీ రామస్వామి, గుంపెల్ల గూడెం ఉప సర్పంచ్ ఎర్రబెల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్సీ ఎన్నికలు



**కారేపల్లి, మే 26 (నిఘా న్యూస్):** సింగరేణి మండలం కేంద్రంలో మే 27వ తేదీన జరగనున్న ఖమ్మం నల్గొండ వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ నందు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలింగ్ నిర్వహణ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సింగరేణి మండల తహశీల్దార్ సురేష్ కుమార్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని అన్నారు. సింగరేణి మండల కేంద్రంలో మొత్తం ఓటర్లు 2,794 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద వంద అడుగుల దూరం పాటిస్తూ ఓటర్లను ఓటు అభ్యసించవచ్చని తెలిపారు. ఓటర్లను ఎటువంటి ప్రలోభాలకు గురి చేయొద్దని అన్నారు.

## జాడ లేని పంచాయతీ కార్యదర్శి..?

### కంపు కొడుతున్న పంచాయతీ విధులు





**లోకేశ్వరం, మే 26 (నిఘా న్యూస్):** మండలంలోని కనకా పూర్ గ్రామంలో పన్నులు వసూలు చేస్తు న్నారు. కానీ సరైన సమయానికి నీళ్లు వీధి దీపాలు చెత్త సేకరణ డ్రైనేజ్ శు భ్రపరచడం లేక కంపు కొడుతున్న వీధులు సరైన సమయాని కి నిర్వహించడం లేదు ఇల్లు శుభ్రపరచుకోని వ్యక్తి గ్రామాన్ని ఏం శు భ్రపరుస్తారు. గ్రామపంచాయతీ ముందు ఇనుకుడు గుంత నిర్మించడానికి తెచ్చిన మెటీరియల్ గత ఆరు నెలలుగా అలాగే ఉంది కానీ ఇనుకుడు గుంత నిర్మించలేదు వీధి దీపాలు పారిశుద్ధ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు మూడు రోజులకు ఒకసారి చెత్త సేకరిస్తే రోగాల బారిన పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి మా గ్రామంలో సమస్యలను తీర్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

# పొరపాట్లకు తావు లేకుండా విధులు నిర్వహించాలి


- ఉప ఎన్నిక డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి, ప్రియాంక ఆల



**కొత్తగూడెం, మే 26 (నిఘా న్యూస్):** వరంగల్-ఖమ్మం- నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికకు సంబంధించి కొత్తగూడెం శ్రీ రామచంద్ర డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రం (డిస్ట్రిబ్యూషన్ సెంటర్) ను జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల ఆదివారం పరిశీలించారు.పోలింగ్ సామాగ్రి పంపిణీ ప్రక్రియను పంపిణీ కేంద్రంలో ఏర్పాటులను పరిశీలించిన అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రి పక్కగా అందించాలని, చెక్ లిస్ట్ ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా లేదా అన్నది సరిచూసుకోవాలని తెలిపారు.పోలింగ్ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. పోలింగ్ సిబ్బంది, పరికరాలు పోలింగ్ కేంద్రాల వద్దకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను, వాటికి అమర్చిన ట్రాకింగ్ పరికరాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాల వద్దకు సిబ్బందిని చేరుకునేలాగా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. వర్ష సూచనలు ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించాడు. బ్యాలెట్ పెట్టెలా రవాణాకు పటిష్టమైన భద్రత కల్పించాలని తెలిపారు. రేపు పోలింగ్ అనంతరం రిసెప్షన్ సెంటర్ కూడా ఇక్కడే ఉంటుందని కలెక్టర్ తెలిపారు.మే 27 సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే పోలింగ్ కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య,కొత్తగూడెం ఆర్ డి ఓ మధు, భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు, కొత్తగూడెం తాసిల్దార్, పుల్లయ్య, డిప్యూటీ తహసిల్దార్, అంజద్ పాషా,ఎలక్షన్ సెల్ సూపర్డెంట్ ధారా ప్రసాద్, రంగా ప్రసాద్, ఎన్ ఐ సి, సుశీల్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# నామినేటెడ్ పోస్టులపై సీనియర్ల ఆశలు

### దక్కించుకునేందుకు తమవంతు ప్రయత్నాలు



**అంబర్ పేట్, మే 26 (నిఘా న్యూస్):** నామినేటెడ్ పోస్టుల భర్తీపై అధికార కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. లోక్ సభ ఎన్నికలకు ముందే 37 నామినేటెడ్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయగా మరో 17 నామినేటెడ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. లోక్ సభ ఎన్నికల కోడ్ ముగియగానే జూన్ మొదటి వారంలో మరో 17 పోస్టులకు చైర్మన్ లను నియమించేందుకు కసరత్తు జరుగుతుంది. మొదటి, రెండవ విడతలుగా తెలంగాణ రాష్ట్రంలోని 54 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించేందుకు ప్రభుత్వం రెడీ అవుతుంది. ఈ మేరకు రెండవ లిస్టులో 17 పోస్టులకు సంబంధించి రాష్ట్రంలోని సీనియర్ల పేర్లను ముఖ్యమంత్రి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పరిశీలిస్తున్నట్లు తెలిసింది. గత కొన్ని ఏళ్లుగా కాంగ్రెస్ ను నమ్ముకుని కష్టపడి పనిచేసిన సీనియర్లను సీఎం చైర్మన్ పోస్టుల్లో నియమించనున్నట్లు సమాచారం. నామినేటెడ్ పోస్టుల భర్తీపై సమాచారం అందుకున్న అంబర్ పేట నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతల్లో ఉత్సాహం ఉరకలేస్తుంది. గత కొన్ని దశాబ్దాలుగా సీనియర్ నేతలు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేస్తూ, ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి తమ వంతు కృషి చేస్తున్నారు. అయితే కష్టపడి పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్లకు చాలా ఏండ్లుగా పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టుల్లో న్యాయం జరగడం లేదు. ఈసారైనా నామినేటెడ్ పోస్టుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమకు ప్రాధాన్యత కల్పిస్తారని సీనియర్లు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే నియోజకవర్గానికి పెద్ద దిక్కైన మాజీ పిసిసి అధ్యక్షుడు వి.హనుమంతరావు, ఖైరతాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ రోహిన్ రెడ్డి ద్వారా నామినేటెడ్ పోస్టులు దక్కించు కునేందుకు సీనియర్లు తమ వంతూ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఆశించి భంగపడ్డ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ యాదవ్ తో పాటు గత కొన్ని దశాబ్దాలుగా పార్టీ కోసం సేవలందిస్తున్న సీనియర్లు ఇందులో ఉన్నట్లు తెలిసింది.

# కౌంటింగ్ కేంద్రాల్లో అప్రమత్తంగా ఉండాలి



### కాపు సేన నాయకుల డిమాండ్

**తిరుపతి, మే 26 (నిఘా న్యూస్):** గతంలో తిరుపతి ఎమ్మెల్యే స్థానం ఎన్నికల కౌంటింగ్ రోజు టిడిపి అభ్యర్థి సుగుణమ్మ గెలిచిందను కుంటున్న చివరి గడియల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి గెలిచినట్టు ప్రకటించడం వెనుక లోగుట్టు పెరుమాళ్ళ కెరుక అన్నట్టు ఈసారి తారు మారు కాకుండా జూన్ 4వ తేదీ అయినా తిరుపతిలో అసెంబ్లీ, పార్లమెంట్ 2024 ఎన్నికల కౌంటింగ్ నందు జాగ్రత్త వహించి నిజమైన ప్రజా ఓట్లతో గెలిచిన విజేతలకే పట్టంగట్టేలా అధికారులు జాగ్రత్త లు వహించాలని బలిజ సేన రాష్ట్ర అధ్యక్షులు.జనసేన నాయకులు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ బెల్లంకొండ సురేష్.బండ్ల లక్ష్మీపతి.నీలాద్రి. గుండాల వేణు.రఘు రాయల్ తదితరులు డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఆదివారం మీడియా ముందు వీరు మాట్లాడుతూ గతంలో 2009 ప్రజారాజ్యం పార్టీ పుట్టుక నుండి తల్లి పిల్ల కాంగ్రెస్ లు చేస్తున్న దుర్మార్గపు రాజకీయాలు అందరికీ తెలిసిన విషయమన్నారు. అది మరోసారి రిపీట్ కాకుండా చూడాలని అధికారులను ఈ సందర్భంగా కోరారు. జనసేన తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరని శ్రీనివాసులుకు పోలీస్ సెక్యూరిటీ ఇవ్వాలని కోరామని. అధికారులు వెంటనే అంగీకరించి సెక్యూరిటీ ఏర్పాటు చేయడం ఆనందదాయకమన్నారు.జనసేన నాయకులపై దాడులు చేయాలని ప్రయత్నిస్తే ప్రతి దాడులకు కూడా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఏది ఏమైనా రాష్ట్రం లో కూటమి అధికారంలోకి రావడం ఖాయమని అని జోష్యం చెప్పారు.

# సిపిఎం శిక్షణ తరగతులకు ఆహ్వాన సంఘం ఏర్పాటు




### సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్

**భువనగిరి, మే 26 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణ కేంద్రంలో జూన్ 15, 16 తేదీలలో రెండు రోజులపాటు భువనగిరి పట్టణ కేంద్రంలో జరిగే సిపిఎం యాదాద్రి భువనగిరి జిల్లా రాజకీయ శిక్షణ తరగతుల జయప్రదంకై ఏర్పాటుచేసిన ఆహ్వాన సంఘం సమావేశంలో ముఖ్య అతిథులుగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా ఉన్న సిపిఎం నాయకత్వానికి పార్టీ సభ్యులకు రాజకీయంగా చైతన్యం కలిగించడం కోసం జూన్ 15,16 తేదీలలో భువనగిరి పట్టణ కేంద్రంలో రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని వారు అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి ప్రజా ప్రయోజనకర పథకాలను ప్రజలకు నేరుగా చేరేలా బాధ్యత తీసుకోవాలని, ఎన్నికల సందర్భంగా ఇప్పటివరకు కాలయాపన జరిగిన, ప్రస్తుతం ప్రజా సమస్యలను నియోజకవర్గాల వారీగా అధ్యయనం చేసి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేయాలని వారు అన్నారు. ఈ నేపథ్యంలో సిపిఎం నాయకత్వానికి, పార్టీ సభ్యులకు రాజకీయ చైతన్యం కలిగించి, గ్రామీణ స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతర కార్యక్రమాలను రూపొందించి ప్రజా పోరాటాలను నిర్వహించడం కోసం భవిష్యత్ ప్రజా ఉద్యమాలను ఉధృతం చేయడం కోసం ఈ శిక్షణా తరగతులు ఉపయోగపడతాయని వారు అన్నారు. అదేవిధంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ మాట్లాడుతూ భువనగిరి పట్టణ కేంద్రంలో నిర్వహించే సిపిఎం రాజకీయ శిక్షణ తరగతులకు అన్ని వర్గాల ప్రజలు, మేధావులు, విద్యావంతులు, వ్యాపారస్తులు సహకరించి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని వారు కోరారు. అనంతరం శిక్షణ తరగతుల ఆహ్వాన సంఘం ఏర్పాటు చేయడం జరిగింది. అధ్యక్షులు గద్దె నరసింహ అధ్యక్షులు బట్టుపల్లి అనురాధ, ప్రధాన కార్యదర్శి మాయ కృష్ణ, చీఫ్ ప్యాటరన్స్ గా సంగు నరేందర్, సంగు రమాదేవి, ఉదయగిరి మధుమోహన్, పోకల దయానంద్, జిట్టా ధనాపరెడ్డి, ఉపాధ్యక్షులు గంధమల్ల మాతయ్య, బందెల ఎల్లయ్య, ఓవల్దాస్ అంజయ్య, బర్ల వెంకటేష్, దాసరి మంజుల, కార్యదర్శులుగా బండి రవి, పర్వతి బాలకృష్ణ, దండు గిరి, కల్లూరి నాగమణి, కొండెం నాగభూషణం, ప్రచార కార్యదర్శులు కొలుపుల వివేక్, వనం రాజు, చింతల శివ, ఏర్పాటు చేయడం జరిగింది. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నరసింహ,గడ్డం వెంకటేష్,నాయకులు లావడ్య రాజు,బోడ భాగ్య, లలిత మాయ రాణి,గీస అంజయ్య, నరాల నరసింహ గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.



అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిధిలో ఆదివారం భారీ ఈదురు గాలులతో కురిసిన వర్షానికి ఔటర్ రింగ్ రోడ్డు నుండి నాగోల్ వెళ్లే రేడియల్ రోడ్డులో గౌరెల్లి చౌరస్తా వద్ద బిల్డింగ్ పై కూలిన హోర్డింగ్ తో పాటు గౌరెల్లి, అబ్దుల్లాపూర్ గ్రామంలో రోడ్డు పైన చెట్లు విరిగి పడ్డాయి.

*-అబ్దుల్లాపూర్ మెట్, మే 26 (నిఘా న్యూస్):*

## ఈము రైతులను ఆదుకోవాలని

### కూనంనేనికి వినతి



**ఖమ్మం, మే 26 (నిఘా న్యూస్):** ఈము రైతులను తక్షణం ప్రభుత్వం ఆదుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఈము రైతులు ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన -సభ్యులు కూనంనేని సాంబశివరావుకు ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈము -రైతులకు సబ్సిడీ అందిస్తుందని తెలంగాణలో కూడా ఈము రైతులకు సబ్సిడీ అందించేలా ప్రభుత్వంతో -మాట్లాడాలని వినతి పత్రంలో కోరారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని ఈము రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో గరికపాటి వెంకట్రావు, శ్రీనివాస్, ఆదినారాయణ, వీరయ్య, పాపిరెడ్డి, భరత్, గోవిందరావు, కృష్ణంరాజు, సత్యనారాయణరెడ్డి, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి

### ఎస్ఐ బి.రామ్మోహన్



**గంభీరావుపేట, మే 26 (నిఘా న్యూస్):** క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, విద్యార్థులు విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని ఎస్ఐ రామ్మోహన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కేజీ- పీజీ క్యాంపస్ లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ఎస్సై రామ్మోహన్ నేతృత్వంలో మండలంలోని అన్ని గ్రామాల యువతకు దోస్తీ మీట్ 2024 క్రీడలను నిర్వహించారు. కబడ్డీ వాలీబాల్ లాంటి క్రీడలను నిర్వహించారు. ఆదివారం రోజు వాలీబాల్ పోటీలలో కొత్తపల్లి లింగన్నపేట టీంలు తలపడగా విజేతగా కొత్తపల్లి టీం నిలిచింది. విజేతలకు ఎస్ఐ బహుమతులు అందించి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చదువుతోపాటు క్రీడలపై దృష్టి సాధించాలని, పోలీసుల ఆధ్వర్యంలో గ్రామీణ క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలు నిర్వహించామన్నారు. యువత మంచి మార్గం వైపు అడుగులు వేస్తూ బంగారు జీవితానికి బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన టీం లకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించబడతాయని తెలిపారు. ఈ వీరి వెంట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**లోకేశ్వరం, మే 26 (నిఘా న్యూస్):** మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 1995-96 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం 28 ఏళ్లకు ఒక చోట చేరి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ క్రమంలో ముందుగా ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకునియోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని చిన్ననాటి తీపి గుర్తులను గుర్తు చేసుకుని, రోజంతా సంతోషంగా గడిపారు. అనంతరం విద్యబుద్ధులు నేర్పిన గురువులకు సన్మానం చేశారు.

## హరికృష్ణా రెడ్డి చిత్ర పటానికి ఎమ్మెల్యే చెవిరెడ్డి పుష్పాంజలి



**పాకాల, మే 26 (నిఘా న్యూస్):** చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం సామిరెడ్డి పల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ హరికృష్ణా రెడ్డి ఈనెల 18వ తేదీ ఆకస్మికంగా మృతి చెందారు.ఆదివారం సామిరెడ్డి పల్లిలో నివాసం వద్ద ఆయన దశ దిన కర్మక్రియలకు.చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు తుడా ఛైర్మెన్, చంద్రగిరి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డిలు హాజరై చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అండగా ఉంటామని ఓదార్చారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి సీనియర్ నాయకుడిగా హరికృష్ణా రెడ్డి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. చెవిరెడ్డి కుటుంబ సభ్యులతో పాటు స్థానిక పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని హరికృష్ణ రెడ్డి చిత్ర పటానికి అంజలి ఘటించారు.

# అంబర్ పేటలో నడ్డీ విరుస్తున్న 'వడ్డీ' మాఫియా

- పేదల అవసరాలే పెట్టుబడి
- నూటికి 10 శాతం వడ్డీ వసూలు
- సకాలంలో చెల్లించకుంటే వేధింపులు

**అంబర్ పేట్, మే 26 (నిఘా న్యూస్):** అంబర్ పేట నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఆక్రమ వడ్డీ వ్యాపారుల ఆగడాలు మీతిమీరిపోతున్న సంబంధిత అధికారులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అవసరాలరీత్యా,వ్యాపారం కోసం సామాన్య ప్రజలు, చిరు వ్యాపారులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి వారి వద్ద వడ్డీకి డబ్బులు తీసుకుంటున్నారు. ఇదే అదనుగా కొంతమంది వడ్డీ వ్యాపారులు నూటికి ఐదురూపాయల నుండి పది రూపాయల వరకు అక్రమంగా వడ్డీ వసూలు చేస్తున్నారు. ప్రధానంగా మార్కెట్లు ఉన్న ప్రాంతాల్లో వడ్డీవ్యాపారులు చిరు వ్యాపారులకు ఉదయం వెయ్యి రూపాయలు ఇచ్చి సాయంత్రం 15 వందలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అదేవిధంగా మరికొంతమంది వడ్డీ వ్యాపారులు సామాన్య ప్రజలకు 5వేల రూపాయలు అప్పుగా ఇచ్చి వారానికి 15 వందల చొప్పున వడ్డీని వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే సకాలంలో వడ్డీ చెల్లించని వారి నుండి వడ్డీ వ్యాపారులు ముక్కుపిండి చక్రవడ్డీ వసూలు చేస్తూ అక్రమంగా రెండు చేతుల సంపాదిస్తున్నారు. వడ్డీ డబ్బులు చెల్లించని సామాన్య ప్రజలు, చిరు వ్యాపారులపై వడ్డీవ్యాపారులు దౌర్జన్యాలకు, దాడులకు దిగబడుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అప్పుగా డబ్బులు తీసుకున్న వారు ఎదురు తిరిగితే వడ్డీవ్యాపారులు రౌడీల సహకారంతో వారిపై దాడులు చేయిస్తూ నానా హంగామా సృష్టిస్తున్నట్లు, ఫోన్లలో పచ్చి బూతులు తిడుతున్నారని వారు పేర్కొన్నారు. ఇదేవిధంగా బతుకమ్మ కుంటాకు చెందిన ఓ మహిళను మరో మహిళ వడ్డీ కోసం వేధించడంతో ఆమె అంబర్ పేట పోలీసులను ఆశ్రయించారు. సకాలంలో అసలు, వడ్డీ డబ్బులు చెల్లించని పక్షంలో వడ్డీవ్యాపారుల తరపున రౌడీలు, వారి అనుచరులు రంగంలోకి దిగి పేదలపై ప్రత్యక్షదాడులకు దిగుతూ మహిళల పట్ల అసభ్యంగా ప్రవరిస్తున్నారని వారు గుర్తు చేశారు. అప్పులు తీసుకున్న వారి ద్విచక్రవాహనాలను, ఆటోలను, ఇంట్లోని టీవీలు, ఫ్రిడ్జీలను వడ్డీ వ్యాపారులు దౌర్జన్యంగా



తీసుకుని వెళ్లిపోతున్నారని వారు ఆరోపించారు.పలు సందర్భాల్లో అప్పులు తీసుకున్న వారికి సంబంధించిన స్థిరాస్తులను కూడా వడ్డీ వ్యాపారులు తమ పేరున రాయించుకుంటున్నారని పలువురు ఆరోపించారు.అంబర్ పేట్ బతుకమ్మ కుంట, పటేల్ నగర్, ప్రేమ్ నగర్, గంగానగర్, గోల్నాక, బాగ్ అంబర్ పేట్, మల్లికార్జున నగర్, నల్లకుంటఫీవర్ హాస్పిటల్, శంకర్ మట్, రత్నా నగర్ తదితర ప్రాంతాలలో అక్రమ వడ్డీవ్యాపారం జోరుగా సాగుతుందనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతి తీసుకోకుండానే ఇక్కడికి వడ్డీ వ్యాపారులు చట్టవిరుద్ధంగా వడ్డీ వ్యాపారం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అక్రమ వడ్డీ వ్యాపారులపై బాధితులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసిన సివిల్ కేసు అంటూ ఇలాంటి చర్యలు తీసుకోవడం లేదని వారు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ వడ్డీ వ్యాపారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేశారు.

## పేద ప్రజలు వేసుకున్నటువంగ్టి గుడిసెలు కూలి నేలమట్టం





పెద్దఅంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు రావి నారాయణరెడ్డి కాలనీ ఫేస్-3 భూ పోరాటం కేంద్రంలో ఆదివారం భారీ ఈదురు గాలులతో కూడిన వర్షానికి పేద ప్రజలు వేసుకున్నటువంగ్టి గుడిసెలు కూలి నేలమట్టం కావడంతో గుడిసె వాసులను కలిసిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి వారికి మనోధైర్యం ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు మాజీ కౌన్సిలర్ అజ్మీర హరిసింగ్ నాయక్, భూ పోరాట కమిటీ సభ్యులు, ప్రజా సంఘ నాయకులు, మహిళా సమైక్య నాయకురాలు తదితరులు పాల్గొన్నారు. పెద్దఅంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు రావి నారాయణరెడ్డి కాలనీ ఫేస్-3 భూ పోరాటం కేంద్రంలో ఆదివారం భారీ ఈదురు గాలులతో కూడిన వర్షానికి పేద ప్రజలు వేసుకున్నటువంటి గుడిసెలు కూలి నేలమట్టం కావడంతో గుడిసె వాసులను కలిసిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి వారికి మనోధైర్యం ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు మాజీ కౌన్సిలర్ అజ్మీర హరిసింగ్ నాయక్, భూ పోరాట కమిటీ సభ్యులు, ప్రజా సంఘ నాయకులు, మహిళా సమైక్య నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణా రెడ్డి చిత్ర పటానికి ఎమ్మెల్యే పుష్పాంజలి

**పాకాల, మే 26 (నిఘా న్యూస్):** చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం సామిరెడ్డి పల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ హరికృష్ణా రెడ్డి ఈనెల 18వ తేదీ ఆకస్మికంగా మృతి చెందారు. ఆదివారం సామిరెడ్డి పల్లిలో నివాసం వద్ద ఆయన దశ దిన కర్మక్రియలకు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు తుడా ఛైర్మెన్, చంద్రగిరి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డిలు హాజరై చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అండగా ఉంటామని ఓదార్చారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి సీనియర్ నాయకుడిగా హరికృష్ణా రెడ్డి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. చెవిరెడ్డి కుటుంబ సభ్యులతో పాటు స్థానిక పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని హరికృష్ణ రెడ్డి చిత్ర పటానికి అంజలి ఘటించారు.

## బాల సుందరం రెడ్డి మృతి బాధాకరం

### మాజీ మంత్రి అమర్ దంపతులు



**పలమనేరు, మే 26 (నిఘా న్యూస్):** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ జడ్పిటిసి సభ్యులు బాల సుందరం రెడ్డి మృతి బాధాకరమని మాజీ మంత్రి అమరనాథ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధాప్య సమస్యతో శనివారం బాల సుందరం రెడ్డి మృతి చెందారు. దీంతో విషయం తెలుసుకున్న అమరనాథ రెడ్డి ఆయన సతీమణి రేణుకా రెడ్డితో కలసి ఆదివారం బాలసుందరం రెడ్డి భౌతిక కాయానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారి కుటుంబీకులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. అనంతరం బాలసుందరం రెడ్డి సేవలను ఆయన కొనియాడారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం అహర్నిశలు కృషి చేశారని, తనకు వ్యక్తిగతంగా రాజకీయాలలో వెన్నంటి ఉండి క్రమశిక్షణ, నిబద్ధతకు మారుపేరుగా రాణించా%తీ%ని కొనియాడారు. నేడు ఆయన లేని లోటు పార్టీకి మరియు తనకు వ్యక్తిగతంగాను తీర్చలేనిదని ఆయన ఆవేదన వ్యక్తం. సంతాప కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రెయిన్ బజార్ లో చెత్త తొలగింపు



**రెయిన్ బజార్, మే 28 (నిఘా న్యూస్):** రెయిన్ బజార్ డివిజన్ పరిధిలోని గంగనగర్, బడాబజర్ ప్రాంతాల్లో డివిజన్ కార్పోరేటర్ మహమ్మద్ వసీయుద్దీన్ ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా పల్లు చోట్ల రోడ్ల పై చెత్త పేరుకు పోవడంతో ఇబ్బందిగా మారిందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే శానిటేషన్ సిబ్బందికి సమాచారం అందించి చెత్తను క్లియర్ చేయించారు.

## మదర్ థెరిసా కళాశాలలో.. ముగిసిన క్రికెట్ సంబరాలు



- విద్యార్థులకు విద్యతో బాటుక్రీడలు కూడా ఎంతో అవసరం
- అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి

**పలమనేరు, మే 26 (నిఘా న్యూస్):** నియోజకవర్గ పరిధిలో గంగవరం మండలం నందుగల మదర్ థెరిసా కళాశాలలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ సంబరాలు ఆదివారంతో విజయవంతంగా ముగిశాయని కరెస్పాండెంట్ రవీంద్ర బాబు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. విద్యార్థులలో క్రీడాస్ఫూర్తిని నింపడానికి మదర్ థెరిసా విద్యాసంస్థలు ముందంజలో ఉంటాయన్నారు. వైస్ చైర్మన్ సునీల్ మాట్లాడుతూ యువతలో నాయకత్వ లక్షణాలు మరియు సమయస్ఫూర్తిని నింపడానికి క్రీడలు ఎంతో తోడ్పడు తాయన్నారు. విద్యార్థులకు విద్యతో బాటుక్రీడలు కూడా ఎంతో అవసరం అని అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి అన్నారు. మదనపల్లె జి.ఎమ్.ఆర్. పాలిటెక్నిక్ కళాశాల రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్ల మధ్య ఫైనల్స్ జరుగగా రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నిక్ జట్టు విజయం సాధించింది. గెలుపొందిన మొదటి జట్టుకు 29వేల రూపాయలు, రెండవజట్టుకు 15వేల రూపాయల నగదు బహుమతులు అందజేశామని ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ క్రికెట్ సంబరాల్లో చిత్తూరు, అన్నమయ్య వైస్సార్ కడప జిల్లాల నుండి 20 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు కృష్ణారెడ్డి,లోకేష్ తెలిపారు. కార్యక్రమాన్ని కళాశాల సిబ్బంది అత్యంత ఘనంగా నిర్వహించారు.

## సమస్యాత్మక గ్రామాలలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహణ



తిరుపతిలో పోలీసుల కవాతు

**తిరుపతి, మే 26 (నిఘాన్యూస్):** కౌంటింగ్ సమీపిస్తున్న దృష్ట్యా జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఐపీఎస్. ఆదేశాల మేరకు ఏర్పేడు పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా నిలువరించాలనే ముఖ్య ఉద్దేశంతో జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ ఆదేశాల మేరకు ఏర్పేడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పేడు సీఐ శ్రీరామ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గోవిందవరం, గోవిందవరం బీసీ కాలనీ, వికృతమాల, పాపా నాయుడుపేట, పెనుమల్లం, రావిల్ల వారి కండ్రిగ, గుడిమల్లం, కుక్కలకుంట, గుడ్ల కండ్రిగ, చెల్లూరు గ్రామాలలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ ను నిర్వహించారు. స్థానికులతో సమావేశమై జూన్ 4 వ తేదీ వరకు ఎలక్షన్ కోడ్ తో పాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, చట్టాన్ని అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. ప్రజలందరూ సంయమనం పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు పోలీస్ స్టేషన్ సిబ్బంది, సీఐ ఎస్.యఫ్. బలగాలు పాల్గొన్నారు.

## బూత్ అధ్యక్షులు పోలింగ్ ఏజెంట్లకు బిజేపీ దిశానిర్ధేశం



**వరంగల్, మే 26 (నిఘా న్యూస్):** వరంగల్ నగరం 42వ డివిజన్లో బూత్ అధ్యక్షులకు, పోలింగ్ ఏజెంట్లకు నేడు జరగబోయే ఉమ్మడి వరంగల్,ఖమ్మం, నల్గొండ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియపై వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 42వ డివిజన్లో బీజేపీ రాష్ట్ర నాయకుడు వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఆదివారం దిశానిర్ధేశం చేశారు. ఈ మేరకు బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 42వ డివిజన్ అధ్యక్షుడు తాళ్లపెల్లి అర్జున్, 40వ డివిజన్ అధ్యక్షుడు ఆకుతోట రాజు, 41వ డివిజన్ అధ్యక్షుడు కర్నె వాసుదేవ్, 39వ డివిజన్ అధ్యక్షుడు బోరిగం నాగరాజు, కర్నె రవి, బక్కి రంజిత్, ఆరె కార్తీక్, శ్రీరామోజు మోహనాచారి, రాజు, కంచ వంశీ, బిక్షపతి, వరుణ్, రాకేష్, అశోక్ చాపల నాగరాజు, అనిల్, రంజిత్, కిరణ్, మహిళా నాయకురాలు సోని తదితరులు పాల్గొన్నారు.



ఘట్కేసర్ రాంపల్లి డబుల్ బెడ్ రూమ్స్ అసోసియేషన్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అంబర్ పేట్ ధర్మశాస్త్ర సేవా సంఘం అధ్యక్షుడు చంద్రమౌళి గౌడ్ గురు స్వామి ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్, ఉపాధ్యక్షుడు యాదగిరి గౌడ్, యూసుఫ్ తో పాటు సభ్యులను శాలువాలకు సన్మానించారు. అనంతరం అసోసియేషన్ ప్రతినిధులు చంద్రమౌళి గౌడ్ గురుస్వామిని సన్మానించారు.

*-ఘట్కేసర్, మే 26 (నిఘా న్యూస్):*

## సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి



**ఉప్పల్, మే 26 (నిఘా న్యూస్):** ప్రజా సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అవసరమైన నిధులు కేటాయింపుకు తన వంతు కృషి చేస్తానని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన నివాసంలో నియోజకవర్గంలోని ఉప్పల్, చిల్కానగర్, నాచారం, కాప్రా, మల్లాపూర్, కుషాయిగూడ, తదిత 'ప్రాంతాలకు చెందిన పలు బస్తీల కాలనీలా ప్రతినిధులు పలు సమస్యలను పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చి వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సంబంధిత అధికారులు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. కొన్ని కాలనీలవాసులు సమస్యలు పరిష్కరించేందుకు నిధుల కేటాయింపు అవసరమని అందుకోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధుల కేటాయింపు తన వంతు చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలపై అధికారులు సానుకూలంగా స్పందిస్తూ పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## రాష్ట్రానికి పట్టిన గ్రహణం వీడాలి

### తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు బాబు రాజేంద్రప్రసాద్



**తిరుమల, మే 26 (నిఘా న్యూస్):** తిరుమలలో వేంచేసి ఉన్న కలియుగ దైవం శ్రీ అలివేలుమంగా పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని రాష్ట్రానికి పట్టిన గ్రహణం వీడి,మంచి రోజులు రావాలని కోరుకున్న రాజేంద్రప్రసాద్, ఇతర నాయకులు ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా రాష్ట్రం అన్ని రంగాల్లో వెనకబడి ఉందని,మన బిడ్డల భవిష్యత్తు అగమ్య గోచరంగా తయారైందని, మరల ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి, నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి గా జూన్ 9 తారీఖున ప్రమాణ స్వీకారం చేయాలని ఆ భగవంతున్ని కోరుకున్నట్లు రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో సింగంశెట్టి సుబ్బరామయ్య,చుక్కధనుంజయ్ యాదవ్,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్న దేవుని ఆలయంలో చోరీ



**లోకేశ్వరం, మే 26 (నిఘా న్యూస్):** మండలం లోని హద్గాం గ్రామంలోని మల్లన్న దేవుని ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగిందని ఆదివారం గ్రామస్థులు తెలిపారు. గుర్తుతెలియని దుండగులు గుడి తలుపులు పగులగొట్టి ఆలయంలోని హుండీని ఎత్తుకెళ్లినట్లు వెల్లడించారు. ఉదయం పూజలు చేసేందుకు వెళ్లిన మహిళలు చూసి గ్రామస్థులకు తెలుపగా వారు పోలీసులకు సమాచారం అందించారు.

# బాడీ బిల్డింగ్ జాతీయ అధ్యక్షులుగా వై. ప్రవీణ్

**అన్ని రాష్ట్రాల అధ్యక్ష కార్యదర్శులు హాజరు**





తిరుపతి, మే 26(నిఘా న్యూస్): గోల్డెన్ ఇండియా బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ సర్వసభ్య సమావేశము, ఎన్నికలునిర్వహించారు. ఎన్నికలు పరిశీలకులుగా మస్కట్ దేశం నుండి షకీల్ నలాకట్ విచ్చేసి డాక్టర్ ఎలమంచిలి ప్రవీణును అలాగే కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ప్రకటనలో తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్చిడ్ విస్టా హెూటల్ నందు గోల్డెన్ ఇండియా బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ సర్వసభ్య సమావేశము ఎన్నికలునిర్వహించారు. ఎన్నికలు పరిశీలకులుగా మస్కట్ దేశం నుండి షకీల్ నలాకట్ విచ్చేసి సర్వసభ్య సమావేశాన్ని ఎన్నికల నిర్వహించారు. అన్ని రాష్ట్రాల ప్రతినిధులు అనగా అధ్యక్ష, కార్యదర్శులు విచ్చేసి ఏకగ్రీవంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ ను అధ్యక్షులుగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. అలాగే ఈ క్రింది కార్యవర్గాన్నిన ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యవర్గం 2024 నుండి 2028వరకు కొనసాగనుందని జాతీయ అధ్యక్షులు గా డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ (ఆంధ్రప్రదేశ్) ప్రధాన కార్యదర్శిగా వి జి బాబు( కేరళ) కోశాధికారిగా జై.కుమార్ (కేరళ) ఉపాధ్యక్షులుగా తన్వీర్ ఖాన్(ఉత్తర ప్రదేశ్) 2)అనైసోని (మహారాష్ట్ర) 3)టి.శేఖర్, 4)షకీల్ సహ కార్యదర్శులుగా పంకజ్ త్యాగి(ఉత్తర ప్రదేశ్ వినోద్ (బెంగాల్) మహేష్ శర్మ(రాజస్థాన్) యూనిస్ భాష (ఆంధ్రప్రదేశ్)ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జోష్1)పొల్యూష( కర్ణాటక) సురేష్ శర్మ (మధ్యప్రదేశ్) సతీష్ (పాండిచ్చేరి) శేఖర్ (హర్యానా) అసోసియేట్ కార్యదర్శిగా అనురాగ్ చౌదరి (ఉత్తరా ఖండ్) చీఫ్ క్యాపిటల్గా సుభాష్ బదనా (ఢిల్లీ) ఎగ్జిక్యూటివ్ నెంబర్లుగా యోగేష్ (నాగపూర్) ఇర్ఫాన్ (కేరళ) గౌరీశంకర్ (ఒరిస్సా) ప్యాట్రన్ గా ఈశ్వర ప్రకాష్ (ఆంధ్ర ప్రదేశ్) మరియు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్గా శివప్రసాద్ (ఆంధ్ర ప్రదేశ్) చైర్మన్ గా మోహన్ సింగ్ రాథోడ్ మధ్యప్రదేశ్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా నూతన జాతీయ అధ్యక్షులు ప్రవీణ్ మాట్లాడుతూ ఇప్పటివరకు దాదాపు 206 ఆర్గనైజేషన్లలో సేవ చేసే భాగ్యం తనకు దొరికిందని కొత్తగా గోల్డెన్ ఇండియా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యవర్గం తనను ఎన్నుకోవడం ఎంతో ఆనందంగా ఉండాలని ఈ నాలుగు సంవత్సరాలలో భారతదేశం నలుమూలల కార్యక్రమాలు విస్తృతంగా ఏర్పాటు చేస్తామని ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల కోసం...

# 30కోట్ల బిఆర్ఎస్ పార్టీ ఫండ్ బదిలీ

- రాష్ట్ర ఎన్నికల అధికారి తక్షణం చర్యలు తీసుకోవాలి
- మెదక్ బిజెపి అభ్యర్థి రఘునందన్ రావు డిమాండ్



**తూప్రాన్, మే 26 (నిఘా న్యూస్):** నేడు జరిగే ఖమ్మం నల్గొండ వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు బిఆర్ఎస్ పార్టీ అకౌంట్ నుండి మూడు జిల్లాల నియోజకవర్గ ఇన్చార్జులు మాజీలు ఎమ్మెల్యే ఎమ్మెల్సీ లకు బిఆర్ఎస్ అధికార ఖాతా నుండి శనివారం 30 కోట్లు బదిలీ చేసిన సంఘటనపై రాష్ట్ర ఎన్నికల అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మెదక్ బిజెపి పార్లమెంటు అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. తూప్రాన్ ఒక ప్రైవేటు కార్యక్రమంలో ఆయన హాజరైన సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు, ఇటీవల జరిగిన ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ గెలవాలని ఉద్దేశంతో ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసి దుర్వినియోగానికి పాల్పడిందని ఆరోపించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు శనివారం బిఆర్ఎస్ అధికారిక ఖాతా అయిన బంజారాహిల్స్ లోని బ్యాంక్ ఆఫ్ బరోడా ఖాతా నెంబర్ (26610100002075) నుండి నియోజకవర్గ ఇన్చార్జిల ఖాతాలోకి 30 కోట్లు బదిలీ చేసిందని ఈవిషయాన్ని రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజుకు ఆన్లైన్ లో ఫిర్యాదు చేశానని తెలిపారు. సోమవారం ఎన్నికల అధికారులు బ్యాంక్ ఆఫ్ బరోడాకి వెళ్లి నిధులు ట్రాన్స్ఫర్ చేసిన విషయం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. బిఆర్ఎస్ పార్టీని రద్దు చేయాలి ఎన్నికలలో అవకతవకలతో డబ్బులు పంచి ఎన్నికలలో గెలవాలని ప్రయత్నిస్తున్న బిఆర్ఎస్ పార్టీ గుర్తింపుని ఎన్నికల సంఘం రద్దు చేయాలని ఎన్నికల అధికారిని కోరారు. బిఆర్ఎస్ పార్టీ పై సంచలన ఆరోపణలు చేశారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ ఎమ్మెల్సీ ఎన్నికలలో అడ్డదారిలో డబ్బులు పంచి గెలవాలని చూస్తుందని అందులో భాగంగా బిఆర్ఎస్ పార్టీ అధికారిక బ్యాంకు ఖాతా బరోడా బ్యాంకు నుండి శనివారం 30 కోట్ల రూపాయలను ఖమ్మం, వరంగల్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జిలుగా పనిచేస్తున్న వివిధ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఖాతాలలోకి బదిలీ కావడం దేనికి సంకేతం అని ఈవిషయంలో రాష్ట్ర ఎన్నికల సంఘానికి మెయిల్ ద్వారా పిర్యాదు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల అధికారులు చర్యలు తీసుకుని నిజం కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో పట్టణ బిజెపి అధ్యక్షులు, కార్యదర్శులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బెల్లి లలితక్క ఆశయాలను

# కొనసాగిస్తాం



**టిపిసిసి సభ్యులు తంగళ్ళపల్లి**

**భువనగిరి, మే 26(నిఘా న్యూస్):** భువనగిరి పట్టణ కేంద్రంలో అమరవీల స్తూపం వద్ద బెల్లి లలిత చిత్రపటానికి తంగళ్ళపల్లి రవికుమార్ ఆధ్వర్యంలో తెలంగాణ గాన కోకిల బెల్లి లలితక్క 25వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తంగళ్ళపల్లి. రవికుమార్ మాట్లాడుతూ పాటనే జీవితంలో మలుచుకొని చివరి శ్వాస వరకు, స్వరాష్ట్రం కోసం తెలంగాణ అస్తిత్వం కోసం, ఉద్యమించిన వీర వనిత, నిరుపేద కుటుంబంలో పుట్టి పొట్టకూటి కోసం పత్తి మిల్లులో పనిచేసి, అక్కడ కార్మికుల హక్కుల కోసం సిఐటియులో చేరి కార్మిక హక్కులను సాధించింది. ఫ్లోరైడ్‌తో బాధపడుతున్న ప్రజలను తన పాట ద్వారా చైతన్యపరిచి, 1996లో ప్రత్యేక రాష్ట్ర సాధన లక్ష్యంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ ఐక్యవేదిక ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో 1997 మార్చి 8న భువనగిరిలో జరిగిన దగబడ్డ తెలంగాణ సభలో బెల్లి లలితక్క కీలక పాత్ర పోషించింది ఆ తర్వాత సూర్యాపేట జిల్లాలో తెలంగాణ మహాసభలో తన పాట ద్వారా జనాలను చైతన్యపరిచింది. తన ఎదుగుదలను ఓర్వలేక కొంతమంది దుండగులు ఆమెను హతమార్చడం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం బెల్లి లలితక్క కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి, ట్యాంక్ బండ్ పై విగ్రహం ఏర్పాటు చేయాలి, అమరవీరుల కుటుంబాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర నాయకులు బట్టు రామచంద్రయ్య, బెల్లి లలిత కుటుంబ సభ్యులు, బెల్లీ సూర్యప్రకాష్, గాయకురాలు వెన్నెల,మొహమ్మద్ రఫీ ఉద్దీన్ గౌరీ (తాహెర్), ప్రధాన కార్యదర్శి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగం పిట్టల బాలరాజ్ సేవాదల రాష్ట్ర కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.



## పాములను పట్టుకొని వదిలేయడంపై అవగాహన

**ఏటూరు నాగారం, మే 26 (నిఘా న్యూస్):** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం అటవీ శాఖ కార్యాలయంలో ఫ్రెండ్స్ ఆఫ్ సొసైటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పాములను పట్టుకోవడం, సంరక్షించడంతో పాటు అడవిలో వదిలిపెట్టడంపై అటవీ శాఖ అవగాహన సదస్సును నిర్వహించింది. దీనితోపాటు నిర్వాహకులు ఓ పామును తీసుకొచ్చి రిహార్సల్ చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ శిరీష, బాలరాజు నరేందర్, కృష్ణవేణి, బేస్ క్యాంప్ సిబ్బంది, వాచర్స్ లు పాల్గొన్నారు.

## సూరారంలో మహిళ అదృశ్యం



**కుత్బుల్లాపూర్, మే 26 (నిఘా న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో గాజులరామారంలో నివాసం ఉండే మాధవి (35) సంవత్సరాలు భర్త సురేష్ (42) సంవత్సరాలు వీరికి ఇద్దరు సంతానం ఒక బాబు ఒక పాప . భర్త పిల్లలు ఇంట్లో లేని సమయాన మాధవి ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్ళిపోయింది. వెళ్లే సమయంలో తనతోపాటు కెమెరా ల్యాప్ టాప్ కొన్ని బట్టలు తీసుకెళ్లినట్టు భర్త సురేష్ పోలీసులకు తెలియజేశారు. ఐదు రోజుల నుండి చుట్టుపక్కల బంధువుల ఇండ్లలో వెతికినా ఎటువంటి ఆచూకీ లభించక పోవడంతో కుటుంబ సభ్యులు పోలీసు వారిని సంప్రదించడం జరిగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు ఎవరికైనా ఆచూకీ తెలిస్తే ఈ కింది నెంబర్లకు ఫోన్ చేయగలరని పోలీసులు తెలియజేశారు. 919908076799, 8712663291.

# ఆహారపు అలవాటు లేదు అనారోగ్యానికి మూలం



డాక్టర్ కె.వై. రాంచందర్ రావు



**ఖమ్మం, మే26 (నిఘా న్యూస్):** నేటి మానవులే కాకుండా సమస్త జీవరాసికి పురుగు మందుల అవశేషాలు గల ఆహారముతో పాటు, ఆధునిక ఆహరపు అలవాట్లే అనేక వ్యాధులకు కారణం తెలిపారు. విషపు ఆహారపు అలవాట్లకు లోను కాకుండా చక్కని జీవన శైలి అలవర్చుకుంటే సమయం, వృధా ఖర్చులు ఆదా అగునని ప్రకృతి జీవన విధానం డాక్టర్ కె.వై. రామచందర్ రావు తెలిపారు. ఆదివారం ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక పెవిలియన్ గ్రౌండ్ నందు గల గ్రంథాలయంలో జరిగిన ప్రకృతి వైద్యం అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కె.వై.రామచందర్ రావు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ప్రతిరోజూ తమ శరీరాన్ని శ్రమింప జేసీ, తగిన నీరు తీసుకొని ఆరోగ్యాన్ని పెంపొందించు. కోవాలని కోరారు. పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాకం శ్యామ్ బాబు అధ్యక్షతన గ్రంథాలయం భవనంలో ఆదివారం ఉదయం జరిగిన ప్రకృతి ఆరోగ్య అవగాహనా కార్యక్రమంలో నెలకొండపల్లి లోని సిద్దార్థ యోగ విద్యాలయ వైద్యులు డాక్టర్ కె.వై. రాంచందర్ రావు ఆరోగ్య అంశాలపై పలు విషయాలు తెలియజేశారు. ఆరోగ్యం కాపాడుకోవాలంటే అనేక మార్గాలు ఉన్నాయని కలుషిత ఆహార పదార్థాలకు అందరూ దూరంగా ఉండాలని ప్రతి ఒక్కరు ఆరోగ్య కాపాడుకోవాలని, విషపూరితమైన పదార్థాలు తీసుకోవద్దని ఆరోగ్యం కాపాడుకోవాలంటే ఖచ్చితంగా నియమాలు పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ కమిటీ నిర్వాహకులు కొండమీద వెంకట్, మంద వెంకటేశ్వర్లు,పిల్లి సుదర్శన్, వి. జ్యోతి,మచ్చ లక్ష్మి, మాధవి,తాల్లూరి వేణు, విజయ్ కుమార్, వెంకట్ బాబు, నాగన్న తొడ్పాటు అందించారు.

# కనకాపూర్‌లో భీమన్న దేవుని పండగ



**లోకేశ్వరం, మే 26 (నిఘా న్యూస్):** భక్తితో వేడిన చాలు కోరిన కోరికలను తీర్చి వెన్నంటి కష్టాలను తొలగించి ఆదివాసీల కలియుగ ప్రత్యక్ష దైవం భీమన్న దేవుడని నాయక్‌పోడ్ కులస్తులు అన్నారు. భీమన్న దేవుడి పండగను పురస్కరించుకొని గ్రామాలలో ఉదయం నుండే పండగ వాతావరణం నెలకొంది. మండలంలోని కనకాపూర్ గ్రామంలో ఆదివారం ఆదివాసీల ఇష్టదైవం భీమన్న దేవుని పండగను ఆదివాసి నాయక్ పోడ్ సంఘం ఆధ్వర్యంలో వారి కుల సాంప్రదాయ బద్ధంగా భజా భజంత్రిలతో మంగళ హారతుల నడుమ భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆదివాసి కుల పెద్దలు మాట్లాడుతూ ప్రతియేటా వర్షాకాలం ప్రారంభానికి ముందు మృగశిర కార్తె ప్రారంభ మవ్వగానే పంటలకు అనుగుణంగా సరైన సమయంలో వర్షాలు కురిసి పాడి పంటలతో గ్రామాలు సస్యశ్యామల మవ్వాలని తమ కుటుంబాలు సుఖశాంతులు ఆయురారోగ్యాలతో విరసిల్లాలని కుటుంబీకులతో కలిసి భీమన్న పండగను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, మహిళలు, యువకులు, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు ధ్వంసం

**రాగి తీగలు చోరీ చేసిన దుండగులు**

**విద్యుత్ శాఖకు దాదాపు 14 లక్షల నష్టం**

**పంచ గుడి ఎత్తిపోతల పథకానికి నిలిచిన విద్యుత్ సరఫరా**



**లోకేశ్వరం, మే 26(నిఘా న్యూస్):** లోకేశ్వరం మండలం లోని పంచ గుడి ఎత్తిపోతల పథకానికి చెందిన విద్యుత్ సబ్ స్టేషన్ లోని రెండు ట్రాన్స్ఫార్మర్లు గుర్తు తెలియని దుండగులు శనివారం రాత్రి ధ్వంసం చేసి వాటిలోని రాగి తీగలను చోరీ చేశారు. చోరీకి గురైన రాగి తీగలు, ఇతర వస్తువుల విలువ దాదాపు రూపాయలు 14 లక్షల వరకు ఉంటుందని సమాచారం. దీనితో ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. ఆదివారం ఉదయం గమనించిన ఎత్తిపోతల పథకం కమిటీ సభ్యులు లోకేశ్వరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి విద్యుత్ శాఖ ఏఈకి సమాచారం ఇచ్చారు. గతంలో కూడా ఇదే తరహాలో కనకాపూర్ ఎత్తిపోతల పథకానికి చెందిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను ధ్వంసం చేసి రాగి తీగలను చోరీ చేశారు. కాగా రైతులు డబ్బులను జమ చేసి మరమ్మతులు చేయించుకున్నారు. కానీ నిందితులు ఇంతవరకు పట్టుబడలేదు. దుండగులు పక్కా ప్రణాళికతో గోదావరి పరివాహక ప్రాంతంలోని ట్రాన్స్ఫార్మర్లను మాత్రమే ధ్వంసం చేస్తూ చోరీలకు పాల్పడుతున్నారు.

## కొత్త చట్టాలపై

# అవగాహన కలిగి ఉండాలి

**జిల్లా ఎస్పీ రక్షిత కృష్ణమూర్తి**



**వనపర్తి, మే26 (నిఘా న్యూస్):** పోలీసులందరూ కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వనపర్తి జిల్లా ఎస్పీ రక్షిత కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం కొత్త క్రిమినల్ చట్టాలపై పోలీసు సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో నేర న్యాయ వ్యవస్థను పూర్తిగా మార్చేందుకు తీసుకోనున్న చర్యలలో భాగంగా కొత్తగా రూపొందించిన మూడు చట్టాలు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం 2023 ఈ మూడు చట్టాలు రానున్న జూలై 1, 2024 నుండి అమలులోకి రానున్నాయని చెప్పారు. వనపర్తి జిల్లాలో ఉన్న పోలీసు సిబ్బంది కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వారం రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. హెూం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం ఈ మూడు చట్టాలు భారత శిక్షా స్మృతి 1860 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973 ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872 లను రీప్లేస్ చేయనున్నాయని అన్నారు. ఈ మూడు కొత్త క్రిమినల్ చట్టాలలో సమకాలీన కాలం, వాడుకలో ఉన్న సాంకేతికత లకు అనుగుణంగా అనేక కొత్త నిబంధనలు చేర్చడం జరిగిందన్నారు.

ఈ మూడు కొత్త చట్టాలు నేరస్థులకు శిక్ష వేయడం కంటే బాధితులకు న్యాయం అందించడం పైనే దృష్టి పెడతాయని, సత్వర న్యాయం అందించడం, న్యాయవ్యవస్థ, న్యాయస్థాన నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ద్వారా అందరికీ న్యాయం అందించడంపై దృష్టి సారించనున్నాయని అన్నారు. ఈ మూడు కొత్త చట్టాలకు డిసెంబర్21, 2023న పార్లమెంట్ ఆమోదం లభించిందని, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము డిసెంబర్ 25, 2023న సమ్మతిని ఇవ్వడం జరిగిందన్నారు. బాధిత వ్యక్తుల హక్కులను పరిరక్షించడం, నేరాల విచారణ, విచారణను సమర్ధవంతంగా నిర్వహించడానికి అనుగుణంగా కొత్త క్రిమినల్ చట్టాలకు చాలా అవసరమైన మెరుగులు దిద్దడం జరిగిందని ఎస్పీ ఈ సందర్భంగా వివరించారు. క్రిమినల్ చట్టాలు మారుతున్న కాలానికి, అవసరాలకు అనుగుణంగా నవీకరించ బడ్డాయని అన్నారు. క్రిమినల్ చట్టాల సూక్ష్మ నైపుణ్యాలను, కొత్త సాంకేతిక పరిజ్ఞానం ఉన్న సమాజానికి వాటి ఆచరణాత్మక ఉపయోగం, చుట్టూ జరుగుతున్న నేరాల గురించి ఎస్పీ క్లుప్తంగా అందరికీ వివరించారు.

తాజాగా సవరించిన చట్టాలను అమల్లోకి తీసుకురావడం ప్రభుత్వం చేసిన మంచి పరిణామమని అన్నారు. కొత్త చట్టాలలో పేర్కొన్న కమ్యూనిటీ సర్వీస్ శిక్షలు, మనకు ఇంతకు ముందు పూర్తిగా తెలియనివి, కొత్త చట్టాల వర్తింపు, నేరాలు దానికి సంబంధించిన కేసులతో వ్యవహరిస్తున్నప్పుడు వాటిని ఎలా గ్రహించాలనే దానిపై పోలీసు శాఖకు చెందిన డీస్పీ నుండి కానిస్టేబుల్ అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఎస్సై వెంకటస్వామి, ఏఎస్ఐ భాష శిక్షణ ఇవ్వనున్నారని చెప్పారు.

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com